తారాతోరణము

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

37

Cl. No. ______ Acc. No. ______

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

# తారాతోరణం

డాక్టరు సందూరి రామకృష్ణమాచార్య,
M. A., Ph. D.

*
* *

ప్రకాశకులు

ప్రగతి గీతా ప్రచురణలు
6-1-911/1, ఖైరతాబాదు,
హైదరాబాదు - 500 004.

వెల రూ 4-00

CHECKED
1992

T
81
R14T

# అనుక్రమణిక


ఆరాధన
తెలుగుతల్లి
తారాతోరణము
నాగీతి
కైవారము
సాక్షాత్కారము
జీవిత సూక్తము
సూక్తవసంతము
సాంధ్యగీతి
అజ్ఞాత కౌంతేయము
అర్ఘ్యాంజలి
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః
నిరీక్ష
**ఆనందసూక్తము**
ఆనంద శ్రుతి
ఉగాది సుహృదభినందనము
శకుంతలానిర్గమనము
పుష్పబాణ విలాసము
మాతృదేవి
తపస్విని
శీర్ణమేఖల
వయస్విని
వేణుగీతి
ప్రేయసి
ప్రశ్న
స్వగతము
స్వాతంత్ర్య ప్రభాస

# తారాతోరణము

"క్రొత్తపాతల మేలు కలయిక"

తొలిముద్రణ

## కట్టమంచి రామలింగారెడ్డిగారి

# ఆముఖము

శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు వ్రాసిన యీ ఖండ కావ్యముల సంపుటి యుఖండరసస్ఫుటము. ఇందలి ఖండములలోని వస్తువు నిస్తులమై సమస్తవిషయ విన్యస్తమైయున్నది. జీవిత సూక్తము, ఓం శాంతి శ్శాంతిశ్శాంతిః, ఆనందశ్రుతి మొదలగునవి ఉపనిషదుక్తులను తలపించుచున్నవి. ఆరాధన, తెనుగుతల్లి, కైవారము, అర్ఘ్యాంజలి మొదలగునవి పూజావిధానమును సన్నిధానపఱచుచున్నవి. ప్రశ్న, మొదలైనవి నవ్యమైన భావసహిత కవిత్వమును నిరూపించుచున్నవి.

శైలియందును శబ్దజాలమునందును ఛందోమార్గము అందును క్రొత్తప్రాతల మేలుకలయిక గనుపట్టుచున్నది.

మైసూరు
**9-12-49**

కట్టమంచి రామలింగారెడ్డి

# తారాతోరణము

## రజతోత్సవ ప్రచురణ

### కవితా కర్పూర నీరాజనము

ఎవ్వాని గళములో నవ్వుకొన్నది
నందనారామ ఫుల్లమందార వల్లి
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను
విశ్వ భారతీ మంజు మంజీర రవము
ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను
పర్వాలు లేని సౌహార్దలక్ష్మి
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను
సుప్తగుప్తదాన వ్రతప్రాప్త తృప్తి
అతడు నండూరి వంశ పయః పయోధి
చంద్రముడు రామ కృష్ణమాచార్య సుకవి;
గద్యపద్య తారాతోరణా ద్యనేక
కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

**కరుణశ్రీ**

## కవితా కల్హార సిరాజనము :

కోరి వరించె నిన్ను పలుకుం జెలి
మెచ్చి స్వయం వరాన
నందూరి కవీ! వెలార్చితివి
ఉజ్జ్వల తారల తోరణమ్ములన్
భారతి కిజ్జడన్ హొయలు వారు
సహస్రపత్ర కల్హారము
నీ కవిత్వము గదా
ప్రథిత ప్రతిభా చతుర్ముఖా!

గరువ మొకింతలేదు; అధికారి నటంచు బడాయి లేదు, సం
బరపడిపోవు చిత్తము, స్వభావము తియ్యని పాలమీగడే;
సరసత మూర్తి దాల్చిన వచస్సు, మనోజ్ఞ రసజ్ఞమాన సాం
తరములు సాహితీద్యుతి, సుధాకవిరాజ బరామరుండహో!

శ్రీ జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి
శాంతిశ్రీ

ధైర్యము రొమ్ము విచ్చినది,
ధర్మము త్రాసున తూగె,
అంచిత ఔదార్యము వ్రేళ్లుపొతుకొనె,
దక్షత పీఠముపైచి నిల్చె;
రామకృష్ణమాచార్యుల
గుండెలోతుల ప్రసన్నతలో
కవితా ప్రభాసలో.

శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు
అష్టావధాని

నీవొక సాహితీఖనివి; నీ సహవాసముచే అపూర్వమౌ
భావములన్ సృజించి, నవవాఙ్మయవీథుల సాహితీప్రియుం
భావుక చక్రవర్తులయి వర్ధిలు శిష్యుల గాంచినావు; పుం
భావ సరస్వతీ! తెలుగు బాసకు దిద్దుము తీరుతీయముల్.

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

'కవి ప్రభాసా' కమల శ్రియం వధ
త్వాప్నోతు కల్యాణ పరం పరాశ్చ,
యస్యాంతు గుంజన్మధు కంఠవాచః
ప్రాచుర్యతాం యాంతి కవీంద్ర భృంగాః

కానిమ్మోయి కవీంద్ర! నీ యతిథి సత్కారమ్ము నీ యింటిలో
వాణీపాద గలంగలన్మధుర నిక్వాణమ్ముతో, ఇందిరా
పాణి ప్రస్ఫుట పద్మగర్భ మధుసంపాతమ్ముతో, నిత్య క
ల్యాణమ్ముల్ మఱి పచ్చతోరణముగా ఆచార్యమిత్రా! యికన్.

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

మీ కవితా ప్రభాస; పుడమిన్ వసుధైక కుటుంబి సత్కవి
శ్రీకరమై కళాభ్యుదయ శీధుసుధారస రస్యవాగ్ఝరీ
శీకరమై ప్రభుత్వమును జేయుచునుండు సదా నవాంధ్రలో
మీ కవితాప్రభాస: గృహమేధికి, వీథికి వెల్గు సర్వదా.

శ్రీ బోయి భీమన్న

హృదయ మమృతసముద్రము; వదనము కవి
తాలతాంగికి నర్తనశాల; సదన
మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము; వి
శాల వసుధాకుటుంబి! నీ సాటినీవె

మా దేశికస్వామి మత్తేభగమనమ్ము
ఛాత్రపాళికి సదాచారశిక్ష
మాదేశికస్వామి మంద్రకంఠధ్వని
శిష్యరాజికి సుఖాసీనముద్ర
మాదేశిక స్వామి మధురానురాగమ్ము
కావ్యపాళికి ధైర్యకంచుకమ్ము
మాదేశికస్వామి మంగళాశీరేఖ
కవి కుమారులకు మార్గప్రదర్శి

మా గురుస్వామి శుభ్రాంఘ్రిమండలములు
శిష్యతతి మౌళులకు సుమశేఖరములు ;
సహృదయుడు రామకృష్ణమాచార్య గురుడు ;
సాటి లేనట్టి కవితా కిరీటధారి.

భోజమహామహేంద్రు ముఖముంగని, మున్, జడుడున్, కవిత్వ వి
భ్రాజితుడయ్యెనంచు వినుపల్కులు, నిక్కువమయ్యె; నీ ముఖాం
భోజముఁ జూచినంత, నెదపొంగెను తీయనికైత; యిట్టి దౌ
వ్యాజము కాక నేను కవినౌటకు వేఱొక హేతువున్నదే!

శ్రీ శనగన నరసింహస్వామి

## కవితా కర్పూర నీరాజనము

అలయక ప్రాత క్రొత్తలగు అద్భుతనందన కాననంబులం
గలయఁజరించి సర్వసుమగంధ మరందములాని, పేశలో
జ్జ్వల కలగాన మాధురులఁ బంచెడి నిత్యమధువ్రతుండవై
వెలసితి రామకృష్ణ సుకవీ ! నవకావ్య సరోజ భారవీ !

**శ్రీ వావిలాల సోమయాజులు**

తిరుపతియని తేట తెన్గు కైతలు గూర్చి
ఆంధ్రమహాదేవి కంజలించె
నాగ స్వరము నూది నవ్యవిద్యార్థులం
బట్టి దేశిక సార్వభౌము డయ్యె
కవులకు 'పెద్దన్నగారు గా' సాహితీ
లోకాన ఉత్తమ శ్లోకుడయ్యె
నేలనాల్గు చెఱంగు లేలజాలిన శిష్య
సంతతిఁ బడసి ప్రశస్తి మెఱసె
పండితాగ్రసరుడు నండూరి కృష్ణమా
చార్యవర్యుఁడుగొ! జానులంటు
బాహులెత్తి, కట్టె భవ్య "తారాతోర
ణమ్ము" వాని యింటి గుమ్మమునకు.

**శ్రీ వాసిలి వేంకట లక్ష్మీనరసింహారావు**

# తారాతోరణము: 'రజత జయంతి'

## "గు రు దే వో భ వ"

"సుకవితాయద్యస్తి రాజ్యేన కిమ్" - అన్న సుభాషితమునకు జీవదుదాహరణం గురుదేవులు డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య.

భీమవరం కళాశాలలో ఉపన్యాసకునిగ వారి ఉద్యోగం "ఒక దశ". వారి ఇల్లు - 'కవితా ప్రభాస' - 'వసుధైక కుటుంబి కవీంద్రుని సాహితీ సదనము. సహృదయులకు రసరాజధాని. వారి అతిథిసేవ ఒక లలితకళ.

అనంతపురం చిత్తూరు కళాశాలలయందు, మరియొక దశాబ్ది పాటు ఆంధ్రపీఠము నధిష్ఠించి యెందరో అంతేవాసులకు భవ్య కవితావేశం ప్రసాదించిన ఆచార్యులు శ్రీమాన్ కృష్ణమాచార్యుల వారు, ప్రస్తుతము తాడేపల్లిగూడెం ప్రభుత్వ కళాశాలా కులపతి.

ఇప్పటున వారి అభిభాషణము ఉదాహరణీయము.

"ఇహలోకంలో తలయెత్తుకొని నేను ప్రభుత్వకళాశాలా కులపతిని అనీ, తలవంచుకొని తెలుగుకవిని అనీ చెప్పుకొగలను."

పరలోకంలో తలవంచుకొని నేను ప్రభుత్వకళాశాలా కులపతిననీ తలయెత్తుకొని తెలుగుకవి ననీ చెప్పుకొగలను."

అయినప్పటికీ, కళాశాలాధినేతయైన పిమ్మట కవి కృష్ణమాచార్య కర్మయోగిగా మారుచున్నట్లు తోచుచున్నది. వారీమధ్య వ్రాసిన పద్యం

జగతియెల్ల మధుర సౌందర్య మయమంచు
కన్నుమూసి కలలు గాంచినాను;
కన్ను - విప్ప తెలిసె, కర్తవ్యమును జేయ
వాసయోగ్యమగును వసుధ యనుచు.

అవును. జీవిత సాఫల్యమునకు కవిత ఒకానొక తరణో పాయము. కర్మయోగము మరియొక మార్గము.

ఆచార్య శంకరుల మెదడు, బుద్ధభగవానుని యెడద తనలో సంగమింపవలెనని వివేకానందుల ఆకాంక్షయట. హృదయము, మేధ సంగమించినప్పుడే విశ్వ శ్రేయస్సు.

సత్కవీశ్వరుడై కళాశాలాధినేతయైన కృష్ణమాచార్య హృదయాళువైన మేధావి.

" సంస్కరింపనేల ? సంఘమంతటినీవు
సజ్జనుండ వగుము స్వార్థముడిగి
ఒక్కనీచుడపుడు ఉర్విలో తగ్గును;
రమ్యహాసలోల రామకృష్ణ "

పటము గట్టిన పద్యము వారి మందిర ప్రాంగణమున సాక్షాత్కరించును. పరిహాసరసికుడైన కర్మయోగి, జీవన్ముక్తుడు కాగలడు.

తారాతోరణము క్రొత్తప్రాతల మేలికలయిక యని కట్టమంచి రామలింగారెడ్డి ఉగ్గడించినారు. అందలి శీర్షమేఖల మున్నగు ఖండికలు దేశభాషలలో అనువాదమున వెలసినవి. శ్రీ ఆచార్యుల వారు 'కవీనాం కవిః'. ముత్తెపు చిప్పలలో పడిన వాన చినుకులు ముత్యములగునని కవి సమయము. శ్రీమాన్ ఆచార్యులవారి నోటి మాటలు యువకవుల యెదదలలో పడి నూతనకృతులుగా వెలసినవి. వారు ఎప్పుడో ఒక శిష్యపరమాణువునకు వ్రాసిన లేఖ - ఒక మహోజ్జ్వల కథానికకు అంతరాత్మ కావచ్చు. ప్రసంగ వశమున విసిరిన ఒక ఛలోక్తి ఒక నవలకు శీర్షిక యగుట కద్దు. ఏపర విధ శిష్యప్రశంసలకు ఆచార్యులవారి సమాధానం వారి వినయ గ్రైవేయం.

"నే నొక ప్రమిదను,
అయితే, కొన్ని కాగడాలను వెలిగించిన
పవిత్ర సంతృప్తి నాకున్నది."

గురుదేవులు రామకృష్ణమాచార్యులవారు నూనూగుమీసాల నూత్న యౌవనంలో రచించిన తారాతోరణం యొక్క శత జయంతి ప్రచురణ ప్రౌఢ నిర్భరవయః పరిపాకంలో వారు వ్రాయ వలసిన మహా కావ్యమునకు నాందీపూజ యగుగాత.

శిష్య సమితి

# కృతి సమర్పణము

మేనమామ

శ్రీమాన్ ఆత్మకూరి గోవిందాచార్యులుగారికి.

నీ యనురాగదీధితు లనిర్వచనీయ కవిత్వ భావముల్
నా యెదలోన నింపు అవినాకృతబంధములన్ వెలార్చి రా
మాయణశిల్పి త్యాగమహిమాన్విత పశ్చిమగౌతమీ ప్రజా
నాయక ! దుందుభీసుభగనాదమనోహరధీరవాఙ్నిధి!

తల్లిగతించె; లో టెపుడు తట్టదు నాకు; దయామృతప్రపల్
వెల్లువలైన చూపులను పెంచితి వీవు; కళారసజ్ఞ మే
నల్లుడు ఖండగీతు లధునాతన వాఙ్మయ శిల్ప సీమలో
నల్లి కృతజ్ఞతాంజలుల నంకిత మిచ్చు పరిగ్రహింపవే !

నీ నయనద్వయీ ధవళనీరజ కోమల మందహాస రే
ఖా నవ సాంధ్యరోచి, నునుకమ్మదనమ్ముల తేనెవాకయౌ
నీ నుడికారపుం బలుకు నిగ్గుల దేలి, మదీయ మానసో
ద్యానము కాన్క వెట్టు సుమనోంజలి గైకొను మో కవీశ్వరా!

గాంధి ఋషివర్యు దివ్యశంఖారవమ్ము
దేశమంతట మ్రోగి ప్రతిధ్వనించు
నట్టి ఆ పవిత్రముహూర్తమందు నీవు
తొలిపిలుపుకె ముందుకు వచ్చి దూకినావు.

రవి యస్త మింపని రాజ్యమేలు దొరకు
దాసోహ మనని స్వాతంత్ర్యరక్తి
ఊరూర విడియుచు ఉప్పు సత్యాగ్రహ
దండయాత్ర నడుపు త్యాగ నిరతి
అర్థశాస్త్రమ్ము రామాయణమును భార
తీయరాజ్యాంగము వ్రాయు నేర్పు
సమరీతిగా చెరసాలకు శాసన
సభకు సరిగిన నిస్స్వార్థపరత
తల్లిసేవకై అర్ధవస్త్రము ధరింప
ప్రజలు ''అంగోస్త్రపాచార్యవర్య'' బిరుదు
నిచ్చి, ప్రేమతో నిన్ను మన్నించినారు;
ధన్యజీవివి! జనయిత్రి దాస్యముడిగె!

ఓ సుగృహీతనామ ! మధురోజ్వల కావ్యకళా విదగ్ధ వి
న్యాసములున్ స్వతంత్రతలు త్యాగనివేశము వెన్నతోడ అ
భ్యాసములయ్యె నీ సదనమందున; ఇంగువ గుడ్డలోని ఆ
వాసనవలె ; నీ చరణపద్మము దాపున నుంతు భక్తితో

నీ దరిని జేరుటంజేసి నాదు బ్రదుకు
దిద్దుకో గల్గినాడ ఈదృశ విధాన!
నాసిక కడ గౌతమి తూర్పునకు స్రవింప
నంత నదియయ్యె ఒక సెలయేరు గాక!

# ఆ రా ధ న

## న వ మౌ క్తి క మా లి కా

పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ శ్రీమన్మహేంద్రాచల
శ్రీ శైలప్రముఖత్రిలింగశిఖరీ ప్రాతర్ప్రహోపస్వినీ !
కృష్ణాకంకనుకింకిణీ ఝుణఝుణద్ గోదావరీకాంచికా!
ద్రాక్షాపేశలవాఙ్మయా విజయతాం త్రైలింగపృథ్వీస్థలీ!

జయతు వింధ్యాచలకిరీటా
జయతు స్వర్ణముఖీనదీమణి
జీర శింజిత మంజు మంజుల
చరణ కంజాతా

ధర్మశూరసుతప్రసూతా
పేశభూసాతిశయనపితా
రసనిభృత సుస్వర సమేతా
జయతు ప్రియమాతా

ఖడ్గవీరాః కావ్యశూరాః
సాహితీరససార్వభౌమాః
బోధిసత్వాస్త్రవ ప్రియసుతాః
పూజ్యమాతృధరే

పౌత్త్రరాహ రసార్ద్రహృదయం
దాక్షిణాత్య విదగ్ధమేధా
తవ శుభగే తరళమంగళ
సూత్రయుగళదకే

యత్ర భావుకరసికతుష్టిః
యత్ర కమనార్థ్యనుభూతిః
తత్ర కృపయా సర్వదాస్మాన్
గమయ ప్రియమాతః

యత్ర దాస్యం నాస్తి భావే
యత్ర విశ్వహితైకమోక్షా
వృద్ధిమాపనిరంతరా స్వాంతే
తత్ర గమయ సదా

హృద్విధేయా యత్ర ధిషణా
యత్ర హేతుః సంప్రదాయ సు
సర్వసంగక బంధముక్తః
తత్ర గమయ సదా

సంగీతార్థ్య మధురమధుర కావ్యలావణ్యపూర్ణా
త్యాగబ్రహ్మప్రణయిత మహాగానసామ్రాజ్యరాజ్ఞీ
శ్రమన్యాగాఢ్య నగనగాశిల్పసాహిత్యధాత్రీ
విద్యావర్యా వినయతు విశాలాంధ్ర పృథ్వీమతల్లీ.

# తెలుగు తల్లి

కవులకంటె తుహినకర్పూరనిభకీర్తి
తెచ్చెరెవరు నీకు తెనుగు తల్లి!
సాహితీ తరంగ సంగీత రసధుని!
దేశభాషలందు తెనుగు లెస్స.

జయము జయము తెలుగు తల్లి!
సకలభాషాపులకిత
పుణ్యచరిత్రమ తల్లి!!
జయము జయము...........

ఉదయభానుని పసిడి కిరణమ్ముల పూర్వదిశా
ముఖముక్రాల రచిత రంగవల్లి! తెలుగు తల్లి!!

తరళ చంద్రికాస్నాపిత కృష్ణాగౌతమీనదీ
తారహార సర్వదిశా ప్రతిబింబిత సుందరగళ
మలయుపవన మందచలిత ఝళంఝళత్ పినాకినీ
సువర్ణముఖరీనూపుర మధురనాద పాదయుగళ !

పౌరాణిక దివ్యశిల్పకళాయుహ్మ పరంపరా
మహాతపస్విశేఖరవిలసిత త్రిలింగవిహారిణీ !
నిలనీరద పరిపుష్ట సస్యక్షేత్రముల సువర్ణ
సుందరసుకుమార చలత్సేలాంచలప్రచారిణీ !

జగదేక పరాక్రమాఢ్య మహారాజ రాజమంత్రి
సేనాపతి మహావీరభట సేవితజనయిత్రీ !
నిత్యనూత్న ప్రతిభాంచిత కవిగాయక తత్త్వవేది
శిల్పకళా స్తోత్రాళ్ళ విలసిత దివ్యామృతధాత్రీ !!

# తారాతోరణము

తరిపి వెన్నెల పచ్చి ముత్యాలకోవ
తొలుకు కలికి క్రొగంటి చూపులు స్రవింప
విశ్వవీథుల మునిమాపు వేళ కట్టి
నావు తరళ తారాతోరణాల నీవు!

నీల నభోంతరాళ రమణీయ విశాల శరత్తమస్విని
ఫాలమునందు తారకల భాస్వర కాంతులు గాంచి విశ్వ శి
ల్పాలయ మందు నీ రచన యంచు తలంతును గాని-అర్థమున్
పోలుపలేక సిగ్గుపడిపోదు నిరక్షరకుక్షి పోలికన్.

అలతి అలంతి కాంతుల విహాయస వీథులలో మిణుంగు పు
ర్వుల వలె తోచు తారకలు భూమికి; వ్యంగ్యరసధ్వనిప్రథా
న లలిత కావ్య శిల్పరచనా ప్రతిభా మహనీయ శేముషీ
కలిత కవీంద్రు భావమృదు కల్పన లట్లు స్వశక్తి గోపనన్.

ఈ రమ్యక్షణదానభోవలయ మంద నిమ్నగంభీర తే
జో రోచిస్సుల విశ్వగానకవితాజ్యోత్స్నాప్రభా మందిర
ద్వారంబందు మహోత్సవంబున జగత్ కళ్యాణ దీక్షారతిన్
తారాతోరణముల్ వెలార్చితివి ఆనందోజ్జ్వలన్మూర్తివై.

ఛందోబద్ధములైన స్వప్నములలో సౌదామనీమాలికా
సౌందర్యమ్ములు నింపు తావక కటాక్షస్నిగ్ధశోభాప్రభా
నందమ్ముల్ గిలిగించి కావ్యరసవిన్యాసమ్ము లస్మద్హృదిన్
చిందుల్ ద్రొక్కగ పల్లవింపజేసితివి నీ వెన్నెల తె నవ్వులన్.

ఆ తెలిమబ్బు నీలితెర కప్పుల తేలుచు వేగుచుక్కతో......
ఈ తొలిసంజ తెమ్మెరల ఈ ఉడు తారల వెల్గుతోవలన్
లేత పసిండి క్రొంవడకు నిగ్గుల ముగ్గులు పెట్టుచున్న నీ
చేతిని నేటికైన పరిసించితి ఓ జగదేకమోహినీ :

నీ యెల నవ్వు వెల్గుల కనీనికలన్ కవితాసుధారసా
మ్నాయ పవిత్ర కోమల నినాద పరంపరలన్ మనః శ్రవః
పేయముగా పఠించి వినిపించి రచింపగ నాజ్ఞ నిచ్చినన్
వ్రాయగఁ బూనినాడ గరువారెను మేన అపౌరుషేయముల్.

తొల్లి కావ్యగీతుల నెన్నొ అల్లినట్టి
మేటి కవినంచు ఉప్పొంగి మించినాను;
నేడిక కవిని గానని నిజము తెలియ
కవితగా నేను కరిగి పో గలిగినాను.

# నా గీతి

నా గీతి నీ హృదిని ప్రేమపాశము చుట్టు
పూలమాలిక పోలె పెనవైచి పొంగించు...

ఏకాకినైయున్న ఏకాంత సమయాన
ఆప్తమిత్రునిపోలె అలపోక పరిచేరు...
పదిమందితో... పయనమగు సమయాన
ఏకాంతవేదికై విశ్రాంతి కల్పించు...

నీలాల నింగిలో నిస్తుల్య విహగాల
మందమారుత మల్లె మబ్బు రెక్కలతో...
అవధు లన్ని దాటి తెలియ ప్రపంచాలు
స్వేచ్ఛగా వెవేగ విహరింప పంపించు ...

దారి తెన్నులు లేక చిమ్మ చీకట్లలో
కన్ను గానక కుమిలి కారాడు కాలాన
ఆకాశవీథిలో అరనుండగ నిలిచి
వెలుగు బాటలు చూపు ధ్రువతారనై...

ఈ గానమాధురులు మృత్యుపాశములో...
చిక్కువడి జీర్ణించు చెదరి పోయెడి వేళ
నిర్ఝరానందమై నిత్యచైతన్యమై
నీ గొంతులో వెలసి నిరవధికమై నిల్చు ...

# కైవారము

గోదావరికి కల్కికుల్కుల నాట్య
    విన్యాసములను నేర్పె నన్నయ కవి
గరువంపు మురుపు వాల్ గనుల యంచుల నింప
    తెనుగు వాణికి నేర్పె తిక్కన కవి
మందార మకరంద మాధుర్యములు
    తెల్గు పాలముల పండించె పోతన కవి
స్వర్గ లోకమునుండి పారిజాతము తెంపి
    తెనుగు సాహితి నాటె తిమ్మన కవి

మువ్వ గోపాలు చిన్నారి మురళితోడ
తాండవింపగఁ జేసె క్షేత్రయ్యగీతి;
తెలుగు హృదయాల తాంబురా తీగె మీటి
అమృత రస తరంగిణి జేసె త్యాగరాజు.

వెలమ బెబ్బులుల కత్తుల ఝళిపింపుల
పులక లెత్తించెడి బుఱ్ఱకథలు
పలనాటి బాలురు పగతుర శిరసులు
బొంగరాలుగ త్రిప్పు పూర్వకథలు
పరచి వచ్చు పతికి పసుపు కుంకుమ బెట్టు
వీర పత్నుల నాటి వింత కథలు
పతితోడ ప్రాణాలు చితిమీద ఆహుతు
లర్పించిన సతుల ఆత్మకథలు

అచ్చతెనుగు హృదయముల అవతరించి
ఆట పాటలుగా అలనాటి నుండి
నేటికినిగూడ తాంబురా మీటులందు
బ్రదికియుండె తెలుగునాటి పల్లెటూళ్ల.

ఏ యిక్ష్వాకుల నాటి వృత్తములో యీ కృష్ణానదీ వాఃకళా
చ్ఛాయాస్వప్న పరంపరాశిథిలముల్ సాక్షాత్కరించున్ మహా
మాయామేదుర మేఘవాటికల శంపా మాలికా ద్యోతులై
మా యాంధ్రావని బౌద్ధశిల్పముల సమ్యక్ పూర్వసంభావనల్

మా నాగార్జునపేరు తత్త్వకవితామాధుర్యముల్ కృష్ణవే
ణీ నాట్యామృతగానవాహినుల ఏ నిత్యత్వదివ్యప్రభా
పానఃపున్యములన్ వెలార్చెనవొ యీ ప్రాచీనతాశిల్ప వి
జ్ఞానోపాసన తర్జనల మృగతృష్ణారేఖలై తోచెడిన్.

# సాక్షాత్కారము

నా శిథిల పర్ణవాటికాంతరములందు
మబ్బు సందులలో చందమామ పోలె
పువ్వుటీరాల మధ్య దోబూచు లాడి
పలుకరించినను బదులు పలుక వేల ?

కవితకు - అసాధ్యమైన - అర్థవిలాసము
వీణకు - అగమ్యమౌ నాద బిందు లయలు
మానసమున కందని భావమధురిమములు
అనుభవింతును నీ మౌనమందు దేవ !

కారు మొయిళ్లు దొంతరలు గ్రమ్మిన చీకటి మధ్య నా కుటీ
ద్వారము చెంత జీర్ణతృణతల్పమునన్ నిదురింప మేఘ గం
భీరమనోజ్ఞగర్జనల పిల్చిన..మేల్కొని కాంచినాను శం
పారమణీయరోచుల భవత్సుకుమారవిరాట్స్వరూపమున్.

మెలకువ వచ్చినంత మిరుమిట్లను గొల్పి భవత్తనూద్యుతుల్
వెలిగెను దిక్కులన్ ; వెలుగు వెల్లువ దృష్టిని మాపె ; అంగకం
బులు పులకించె తే మొగలి పొట్టల విచ్చిన రేకు లట్లు ; అం
జలి నిడునంత ఎచ్చటికి చయ్యన పోయె దదృశ్యమై ప్రభూ !

# జీవితసూక్తము

ఆశ లెండమావు లటంచు అనినయెడల
భయములున్ రజ్జు సర్పవిభ్రాంతి గావె !
మిథ్యగాదోయి జీవితోన్మేష మెల్ల
పురుషకారమే యేకైకపరమపథము.

ముందు రాబోవు శుభదినములనుగూర్చి
తియ్యని పగటి కలలు చిత్రించుకొనకు !
జరిగిపోయిన నాటి సంస్మరణా లేల !
తాల్పు మిప్పుడే నేటి కర్తవ్యదీక్ష.

బ్రదుకొక మాయదారి కల వంటి దటంచు తలంపకోయి కం
దుదలను గ్రమ్ముచున్నతడితో; తుదిలక్ష్యము వల్లకాదు; మే
నిది ఒక మట్టి బొమ్మ ; కడ కియ్యది మట్టినె జేరునంచు గ
ద్గదికముతో వచింప సరిగా దది ఆత్మకు అన్వయించునా ?

కావున, శోకదైన్యములు గ్రమ్మగ నీయకు, నేటికంటె ఈ
జీవనయాత్ర రేపటికి చేరుము ముందుకు; సంకులవ్యథా
జీవిత రమ్యయుద్ధమును చేయుము వీరుడవై జిగీషతో ;
పోవకు గొఱ్ఱెపోతువలె బుఱ్ఱను వంచి గతానుగామివై.

పోరు నప్పుడు మరణించు వారికంటె
పారిపోవునపుడె చచ్చు వారు హెచ్చు
మాయుమర్మాల నడివీథిమధ్య నిలిపి
ముక్కుమీద గ్రుద్దుము మేలిముసుగు తొలగ.

ఉత్తమపూరుషావళి మహాత్ముల జీవచరిత్ర లెల్ల లో
కోత్తర కార్యనిర్వహణ కూర్జితశక్తి నొసంగుచున్ మహో
దాత్తమొనర్చు జీవితవిధానము చూపును; వచ్చువారి కా
వృత్తులు చెప్ప భూమి కనుపింపగ నిమ్ము భవత్ పదాంకముల్.

ఈ మహానంత కాలవాహినిని తేలు
భగ్ననౌకుడు సోదర పథికు డెవడొ
అడుగు జాడల నొక్క నా దరసినపుడు
పగిలిన హృదిని దిద్దుకోవచ్చు తిరిగి.

# సూక్తవసంతము

ఓ రసలోకరాజ్ఞి! అదిగో! నవయౌవనజీవనప్రభా
తారుణకాంతిపంక్తులు దిగంతరముల్ వికసింప జేసె! మం
దారసుమోదయమ్ము మధుధారల తుమ్మెద కర్ఘ్యమిచ్చె; ద్రా
క్షారస మిమ్ము హేమకలశమ్మున; ప్రేమ మరంద వాహినీ!

లెమ్ము! శుభోదయమ్ము! లవలీసుమముల్ నవసాంధ్యరాగముల్
చిమ్మె ప్రపంచ మెల్ల; సరసీసలిలమ్ముల విచ్చు మొగ్గ కెం
దమ్మిని జేరె ఝుంకరణనాదముతో నును వెచ్చ తేనెకై
తుమ్మెద ఱేడు; తూర్పు దెసతోచెను బాలమయూఖమాలియున్.

చిరుకెరటాల క్రొంజిలిపి సిగ్గులు చిందిన కెంపు బుగ్గలన్
పరువము పొంగి వెల్లువలు వారిన వెచ్చని తేనెగుండెతో
అరనెరచూడ్కి పుల్కలలరార హసన్ముఖియౌచు పద్మినీ
విరహిణి కౌగిలిచ్చె తొలివేగున బాలమరీచిమాలికిన్.

కోయిల కమ్మగా వగరు గొంతుకతో ఎల మావి గున్నలన్
కోయని కొమ్మ కొమ్మ పయి కోమల గీతిక లాలపించె; లేఁ
బ్రాయము, పాల పొంగు; క్షణ భంగురముల్ మన జీవితమ్ము లో
ప్రేయసి! చేర రమ్ము విహరింపగ ఈ సెల యేటి తిన్నెలన్.

కాయ మశాశ్వతమ్ము; క్షణ కాలము పోయిన రాదు; సంజ కెం
ఝాయలు గ్రమ్మె పశ్చిమ దిశాముఖమందు ; విలంబమా? సఖీ!
మాయ జగత్తు! నీ వొక అమాయకురాలవు; పూల మొగ్గలే
పూయును గాని వాడి పడిపోయిన పూవులు పూయ వెన్నడున్.

రాలు నొకనాడు కెందలి రాకు లెల్ల!
వాడి పోక తప్పదు పూల పరిమళములు!!
లేత బుగ్గల నిగ్గులు పాత బడును
ఎల్ల కాలమును వసంత మేల నిలుచు?

ముదురు మలిసంజ చీకటి ముసురు మబ్బు
నీలి నీడలు సెలయేటి నీటి లోన
కలసి పోవు చున్నవి ; వేగ కదలి రమ్ము!
పడుచు నిగనిగల్ ముడతలు పడక ముందు.

సంజ వెలుంగులో పసిడి సంపగి కాంతుల నీను పండు నా
రింజ మెరుంగు చీరను ధరించి, ఒయారముతో, చలల్లతా
కుంజము పోలె, వాలు కను గొల్కుల వెల్గులు విస్తరింతు వే
మంజులభావవీచికల మాటున మబ్బుల చంద్రవంకవై.

సిగ్గుల మొగ్గ! చిర్నగవు చెక్కిలిపై కెరటాల పోలె లే
బుగ్గల సొట్టలన్ విరిగి పొంగులు వారిన వెల్గు వాకలో
గగ్గురు పాటు వాల్ గనుల కాటుక యంచుల జార జాళువా
నిగ్గులు పైట చెంగుపయి నింపుము మబ్బుల మించుతీవెవై.

కామము దోష మంచు కలికాలము నేటికి వచ్చె నంచు ఏ
మేమొ వచించుచుండెదరు వృద్ధులు నోటికి వచ్చినట్లు; మా
యామయ మైన దీ ప్రకృతి యంతయు; పూచిన పూలతో గృహా
రామలతానికుంజములు రమ్మనుచున్నవి లెమ్ము! నెచ్చెలీ!

ఆయువు గల్గు నాల్గు గడియల్ మన జీవిత మొక్క స్వర్గమున్
జేయగ వచ్చు; లెమ్ము! వికసించిన పూల రసాలవాటికా
చ్ఛాయలసందులన్ బుడుత చంద్రుడు వెన్నెల లొల్కె; స్వర్గశో
భాయతమయ్యె పుష్పవనమంత వసంతమహోదయమ్ములో.

కెందలిరాకులందు పులకించెడి మొగ్గ గులాబి పోలె, ఆ
నందమరీచిమాలికలు నాట్యము సల్పెడి రెప్పసందులం
దందము జాలువారగ, అపాంగరుచుల్ సుకుమార భావనా
తుందిల మందయానములతో ప్రసరింపుము వెల్గు నీడలన్

ఓ నవనీత యౌవన వయో రుచిరాంగి! హృదంతరాన, నీ
వేసవి మల్లె తావి నెరవిచ్చగ రేపె మనోజ్ఞ వేదనల్;
నీ నును లేత బుగ్గ పసి నిగ్గుల చిందిన మంద హాసరే
ఖా సప సౌంధ్య కాంతి కళికల్; చిరు నిగ్గు మిటారి చూపులున్.

క్రొంజిగురాకు సందులను కోకిలముల్ కమనీయగీతికా
మంజుల మంజు గానముల మామిడి కొమ్మల నెక్కె; మల్లికా
కుంజకుటీరమందు జడ కుచ్చులు పయ్యెదపై నటింప పు
ష్పాంజలి బట్టి నా హృదయమందున తోచితి వీవు నెచ్చెలీ!

నీ చిరునవ్వులో అమృత నిర్ఝరిణీ నవచంద్రికా కళా
రోచులు తాండవించుసు సరోరుహ నూత్న పతీమళ్ ప్రభా
వీచికలట్లు; సంజ అరవిచ్చిన గొజ్జగి పూల మొగ్గలై
పూచిన మల్లెపువ్వులయి పొంగును రెక్కలువచ్చి స్వప్నముల్.

# సాంధ్యగీతి

పవలు గడచెను ; పశ్చిమాంబుధి
నస్తమించెను అంశుమాలియు ;
కటికి చీకటి గ్రమ్ముకొన్నది
భూనభోంతరమున్...

దూరమందున తోచుచున్నది
మింటి దీపిక మిణుగు తారక
దుఃఖసౌఖ్యవిదూరమౌ బరు
వెడదలో గ్రమ్మెన్...

ఎండి పోయిన గుండె లోపలి
పగటి బరువుల పార ద్రోలుచు
బ్రతుకు మరచెడి పాట నొక్కటి
పాడ రా వోయీ...

పెద్ద కవులవి వద్దు చదువకు;
కాల వాహిని గట్ల వారల
నడల వెడలిన అడుగు చప్పుడు
లెపుడు మార్మ్రోగున్...

ఆ మహాకవితాలపనములు
జీవితాహవచిహ్నితమ్ములు ;
నిదుర పుచ్చెడి మృదుల శాంతిని
కోరు నీ రేయీ...

కంట నీటిని గ్రమ్ము నట్లుగ
గుండె లోతులు కుమిలి వ్రాసిన
పేరు కెక్కని పేదకవి దొక
గీతి వినిపింపుము...

తొలకరి మొయిలు దొంతరల గమి
చిందు చిటపాటి చినుకు పోలిక
గుండె దడ పోగొట్టు చల్లని
తలపులను రేపన్...

మధురకవితా మార్దవమునకు
వన్నె పెట్టెడి కిన్నెర రవళి
కమ్మ కంఠము కలిపి చేర్పుము
వేరె లోకమునన్...

# అజ్ఞాత కౌంతేయము

సంధిసంధాత జగదేకబాంధవుండు
పాండవుల రాయబారి గోపాలమౌళి
హస్తిపురినుండి వ్యర్థప్రయత్నుడగుచు
తరలిపోయెను యుద్ధము తప్పదనుచు.

రాజసూయాన తమ పరాక్రమము మరచి
గండు మీసాలపై నిమ్మ పండు నిలుపు
రాజరాజాధిరాజమార్తాండు లెల్ల
చేరుచున్నారు కౌరవసేనలోన.

ఎచ్చట చూచినన్ మదగజేంద్రములే! జవనాశ్వబృందమే!
వచ్చుచునున్న రాజపరివారములే! రథకేతనమ్ములే!
చిచ్చర పిడుగులైన యిరు సేనల వీరులు పోరునాడు గో
ర్వెచ్చని నెత్తుటేరులు స్రవింపక తప్పదు, భారతావనిన్.

పదియునొక్క అక్షౌహిణీబలమునెల్ల
సర్వసేనాపతిగ నీవె సాకుమంచు
ప్రార్థనలు సల్పె భీష్మతో రాజరాజు ;
తనకు పదవి వద్దనలేదు తాతగారు.

భారతయుద్ధమందు తన స్వామి ఋణంబును దీర్చి స్వీయ దు
ర్వార మహా ప్రతాపమున పాండవపక్షము నిగ్రహించు దీ
క్షారతి, అంగరాజు మది సంతసమంచె ; ప్రతీచి వాలు సం
ధ్యారుణ కాంతి పంక్తులు నిజాననసీమను తాండవింపగన్.

అస్తగిరి శిఖరము చేరె అంశుమాలి
రక్తకిరణమసృణమయ్యె ప్రకృతియెల్ల ;
కంబుకేతనప్రభలతో కర్ణు రథము
తరలుచున్న దదె యమునాతటము వైపు.

సారథి లేక ఒంటరిగ స్యందన మెక్కి విశీర్ణ సాంధ్య రే
ఖా రమణీయమూర్తి తురగమ్ముల ఆ యమునా తరంగిణీ
తీరము చేర వల్గనగతిన్ నడిపించె, స్వకీయదైనికా
చారము చొప్పునన్ ; వెలుగు చాయలు చిందిన మట్టి క్రిందికిన్.

సమరోద్వేగనివేశసంభృతమహాశౌర్యప్రభావిస్ఫులిం
గములౌ క్రొమ్మెఱుగుల్ మొఖాన వెలుగన్ కర్ణుండు పొంగారు
స్వాంతముతోడన్ రథ మాపి; ఆ అపరసంధ్యారమ్యరోచిస్సులన్
యమునాసైకతసీమ చేరుకొనె సూర్యారాధనోత్సాహియై.

ఆ యమునానదీసలిలమందున, సన్న యెలుంగు నెత్తి "రా
ధేయుడు సూతసూతి వినుతింపగ వచ్చినవాడు నేడు సూ
ర్యాయ నమోస్తు"టంచు, ప్రపరన్ వచియింపగ, 'ఆగుమంచు' దూ
రాయతనస్వరంబు వినరా పులకించెను తత్తటుపాటునన్.

అంజలి ఘటించినట్టి ఆ అంబురాశి
చారు కరకంజములనుండి జారుచుండ
వెరగు గొంకు తత్తరము ముప్పిరి గొనంగ
కన్నులెత్తి దిక్కులనెల్ల కలయ జూచె.

అంత సమీప సైకత తటాంచల కుంజ కుటీర వాటికా
ప్రాంతమునుండి సంజ అపరంజి వెలుంగుల; మేల్ ముసుంగుతో,
కాంత యొకర్తు మెల్లమెలగా నడయాడుచు ఆ నదీ జలో
పాంతము చేరి నిల్చె, వసివాడిన నెమ్మొగ మెత్తకుండగన్.

నివ్వేరపాటు నుత్తలము నిండు నెడంత శిరమ్ము వంచి "నీ
వెవ్వరవమ్మ ? మౌనము వహించుచు నిల్చితి నీడవోలె! నే
నివ్విధి సూర్యదేవు భజియింపగ 'ఆగుమటం' చు నిప్పుడే
నెవ్వగ పల్కు రెవ్వరొ ! మనోహరదుందుభిధీరవాక్కులన్."

అనుచు కర్ణుండు మృదువుగా నామె నడిగె ;
వనిత వచియించె గద్గదవాక్యములను,
"నీవు రాధేయుడవు కావు నిజము నరయ,
సత్యమేల తప్పెదు కర్మసాక్షి యెదుట ?"

అన విని సంభ్రమించు హృదయమ్మున కర్ణుడు పల్కె, "ఈ సమ
స్యను విడదీయబోయిన ప్రయత్నము నేటికి సాగలేదు; నే
మును వినినా నెవో కథనముల్ పలు రీతుల; గంగనుండియే
కొని నను తెచ్చె సూతు డని కొందరు చెప్పిన వింతగాథలన్.

మనమున భావనాపటిమ మాత్ర కృపా కమనీయ దివ్య మూ
ర్తిని దరిసింపగా కలవరించితి తీయకలల్ సృజించు తీ
రని నిరుపేద కోర్కులు; పురాతన సత్యము వోలె నన్ కద
ల్చెను భవదీయవాక్కులు విచిత్రవిషాదము రేపి నా హృదిన్.

కస్తూరి నిదు రాధ కనుపాప నౌకనాడు
కన్నతల్లియె నాకు కానుపించె
ఉయ్యాల జోకొని ఊగిన నాఁడమ్మ
అతిలోక హస్తమే అరసినాఁడ

కౌదమ ప్రాయమ్ములో నిదుర చెందిన నన్ను
కలలోన జనయిత్రి కౌగిలించె
అంగసింహాసన మధివసింపఁగ నాకు
అజ్ఞాతమాతయే ఆజ్ఞ నిచ్చె

రేలు పవలెల్ల అస్పష్ట రీతి నక్క
డక్కడ ఇచట నచట నే నరయుచుంటి
అవ్యయకృపాతరంగిణి యమ్మ కొరకు;
కాని-ఆమె యీ నిర్భాగ్యు కంట బడదు.

ఘోరభారతయుద్ధాగ్నికుండమందు
ప్రాణ మర్పింపవలె రాజరాజు కొరకు;
కన్న తల్లిని గాంచు భాగ్యమ్ము పొంద
లేను కాబోలు ఈ జన్మలోన నేను."

అనిన గద్గద స్వరముతో ననియె నామె
"కన్నె వయసున భాస్కరు కరుణ వలన
కన్న బిడ్డను గంగలో కలిపి గూడ
బ్రదికియున్నది నీ మాత వసుధయందు.

ఎంతటి మాతృభక్తితొలికించెడి దివ్య మహా కృపా రస
స్వాంతుడవై! నదీజలము పాలొనరించె నినున్, దిగంత వి
శ్రాంతమనోజ్ఞకాంతి వెదచల్లెడు కన్నకుమారు; నైజ మ
త్యంతదయాపరాక్రమము లబ్బుట సూర్యవరప్రసాదికిన్

కన్నగుండె యెంత కల్లోల మయ్యెనో
ఏటిలోన వైచి ఏగునపుడు
కొంత గంగ యెరుగు అంత అర్కుడెరుంగు
అంతరాత్మ యెరుగు నంతమించ"

అనిన కర్ణుండు పలియించె నామెతోడ
"ఇంత చెప్పగ నేల నీ విపుడు నాకు
సృష్టిలో మాతృహృదిని శంకించి నంత
విశ్వవిలయమ్ము కంటెను వేరు గలదె!

ఇంతటిదా ఓర్మిక వహియించితి నెట్లొ విషాదభావనా
క్రాంతమనస్కుతో; తిరిగి రాదు గదా గత మింక; సర్వ వృ
త్తాంతము నీ వెరుంగుదువు; ధన్యుడ నయ్యెద ఈ మహాద్భుతో
దంతమునందు నా జనని దర్శనభాగ్యము కల్గెనా!" యనన్

"సహజకవచకుండలదీప్తచారుమూర్తి
వౌచు, హస్తినాపురవీథి అరుగునపుడు
చూచుచుండియు; తనమోము చూప లేక.
నేటి కిచ్చట నీమాత నిలిచియుండె!

కన్న మమత్వము నెంచక,
నిన్నా గంగను గలిపిన నీచపు మోమున్;
ఎన్నటికి చూడవల ద"ని
కన్నీ రొలుకంగ నామె కనలి వచించెన్.

"అగు మటంచు మేఘనినదార్భటి విన్నడ హర్షభావనా
సాగరమందు మున్గి వివశత్వము నొందితి" నంచు కర్ణుడు
ద్వేగముతోడ నీరములు వెల్వడి తల్లిపదాల వ్రాలినన్;
కౌగిట గ్రుచ్చి యెత్తినది కాలువలై స్రవియింప బాష్పముల్.

అపుడు జన్మైకలభ్యమైనట్టి మాతృ
హృదయసంస్పర్శచే పుల్కరించు మేన
రాజరాజు దక్కగ నితరంబునెల్ల
మరచియుండెను కర్ణుండు కరిగి పోయి.

తల్లి తనయుండు నా రీతి తారసిలగ
కాల పురుషుని నెమ్మేను గగురు పొడిచె ;
కటిక చీకటుల్ పులకించి కంపమొంద
మిణుకు మిణుకుల తారకల్ మింట విరిసె.

డెందము కొండవాగయి పడిన్ ప్రవహింపగ పొంగి, కర్ణు డా
నందసమాధినిర్వృతమనస్కుడు ఆ మధురక్షణంబులో
పొందె నమేయశశ్వదనుభూతిని ; వెల్లువలై శిరమ్ముపై
చిందిన బాష్పబిందువులచే తెలివొంది ముఖమ్ము నెత్తగన్.

తన్ను పుత్రుని విశ్వమంతటిని మరచి
కంపమానావశీకృతగాత్ర యగుచు
ముసుగు జార్చిన ఆమె నెమ్మోము జూచి
కుంతి దేవిగ కర్ణుండు గుర్తు పట్టె.

"వీరుల, సర్వలోకపరివేషితనిర్మలనిత్యకీర్తిదో
స్సారుల; పుత్రులన్, గనిన క్షత్రియమాతవు! పాండురాజు దే
వేరివి! ఇంద్రజాల మనిపించెడి! అర్జును కన్నతల్లివే!
యూరె మదీయపూజ్యజనయిత్రుల? వందనముల్ పదాలకున్.

అర్జునుడు తమ్ముగుఱ్ఱ నా కనినయంత
ఎంత గర్వము వహియించె హృదయ మిపుడు!
పదునెనిమిది అక్షౌహిణీబలములందు
తల్లి! ఏడు లిప్డరును నీ తనయులైరి.

కమ్మని స్వప్నమందు వలె కాంచితి నిన్; మలిప్రొద్దుచీకటుల్
చిమ్మిన యేటి తెమ్మెరల చిత్తము పొందె నపూర్వశాంతి; ర
క్తమ్మును పంచి యిచ్చి కను తల్లి ఋణంబు నెవండు తీర్చు వా
డమ్మ! వహింపు నావలన సయ్యోడి దున్న తరింప నెంచెదన్"

అనిన మాట రాక అటమటించుచు పల్కె
కొంతసేపటి కెటొ గొంతు విప్పి,
"పుత్రు లొకరి నొకరు పొడుచుకొనుచునుండ
కన్న తల్లి యెటుల గాంచ గలదు!

ఆలముపేత, ఎన్నటికి ఆరక మండుచునుండు కారు చి
చ్చేల రగుల్పగా వలయు నిందరి తల్లుల గుండెలన్? ధరా
పాలుడు నీ కనుంగు చెలి; పాండవులున్ నిజసోదరుల్; దయా
శాలివి; సర్వలోకహితసంధి యొనర్పుము సూర్యనందనా!

మాటలు తెల్ప లేవికను; మౌనమె నాహృదయమ్ములోని ఆ
రాటము చెప్పజాలును; ధరాస్థలి పీనుగు పెంట లౌను పో
రాటమునన్; శ్మశానమున రాజ్య మికేటికి? గుండె లేని క
ర్కోటకరాజు లేల ప్రజకున్? తిమిరప్రళయాంధభూమిలో''

లోని కళవళమ్ము పైన దోపగనీక
శిరము నెత్తి అతడు చెప్పదొడగె,
''కలసినాము తల్లి! తొలిసారి కడసారి
గూడ ఇచట ఒక్కనాడె మనము!

కచ్చకు కాలు దువ్వుదును కారులు ప్రేలెద నంచు ఎవ్వియో
యిచ్చకు వచ్చినట్లు వచియింతురు లోకులు; రాజరాజు నన్
మెచ్చగ గోరి, పాండవులమీదను ద్వేషము లేక, యెప్పుడో
యిచ్చితి నా పరాక్రమమునెల్లను భావిరణాంకితమ్ముగన్.

ష్టునునిపైన నా కసూయ యని ప్రజలుఅ
పలుకుచుందురు నిజముకావచ్చు కొంత;
ప్రేమను కృతకముగ చంపివేయునెడల
ఈర్ష్య యౌచు తిరిగి జన్మ మెత్తుచుండు.

సిద్ధము రెండుపక్షముల సేనలు పోరికి; రాజరాజు వ
ర్ద్యోద్ధతి నాప నెవ్వ డిక నోపును? 'తప్ప దవశ్యభావి' లో
కోద్ధరణం బటంచు మధురోక్తులు పల్కగవచ్చు గాని యీ
యుద్ధము లేనిచో బ్రదికియుందురె మర్త్యులు శాశ్వతమ్ముగన్?

వచ్చి నట్టి త్రోవ పట్టి తిరిగిపోయె
సంధి చేయలేక చక్రధరుడె!
రాధకంటె రాజరాజు నన్ ప్రేమించు
ఎప్పు డతని కెదురు చెప్పలేదు.

అమ్మ! రణంబె యిప్పు డిక ఆగిన, పాండవపుత్రులెల్ల చచ్చు ద
ప్పమ్ములు; నీచకర్ణుడు కృతఘ్నశిరోమణి; రాజరాజు మా
నమ్మును సిగ్గు లేక విడనాడిన వీరుడి; సర్వరాజలో
కమ్మును పాదుకొతులును కావలె; విశ్వచరిత్రలోపలన్.

అర్జునుడు తప్ప, పాండవు లాహవమున
చేత చిక్కిన గూడ హింసింప బోను;
అర్జునుడు తన్నుదానె కాపాడుకొనును;
అడుగకుండ నీ కిచ్చితి నమ్మ వరము.

తమ్ము లెవరితోడ తల్లి! నావిషయమ్ము
కథనమునకు ముందు కదుపవలదు;
అన్నగారి పైన అమిత దయయున్న
ధర్మరాజు విడుచు తప్పులమ్మ''

అనవిని కుంతిదేవి అధరాంచలమెల్లను కంపమొందగా
గొనగొన బాష్పధార కనుగొల్కుల జారగ మిన్నకుండె; క్ర
మ్మెను మలిసంజచీకటులు మిన్నున మన్నున అంతకంతకున్
కనపడ రింక కుంతియును కర్ణుడు ఆ యమునాస్రవంతియున్.

తడబడు గుండెల తోడను
నడువగ జాలని మనుజుల నడల వలె వినం
బడు నడుగుల సవ్వడులున్
మడిగె నిసుకపై క్రమక్రమమ్ముగ నంతన్.

ఆ కఠోరప్రశాంతతయందు నెచట
కటికి చీకటి పురుగు ఝుంకారరవమె
గాని; వినరావు నిట్టూర్పులైన గూడ;
ఏలుకొనెను నిస్తబ్ధత యెల్లదిశల.

బంగరు కాంతి పుంజములు ప్రాచ్యదిశన్ వికసించి మెల్లగా
నింగికి ప్రాకసాగినవి; నిర్జనసైకతతీరమందు ఉ
త్తుంగతరంగభంగములతో యమునానది వెల్గువాకయై
పొంగెను; లేత వెన్నెలలు పూసిన సుందరశూన్యసీమలో.

రసరమణీయతల్ ప్రకృతిరంగమునందున బిందు చంద్రు డా
కసమున తోచె; వెల్లువలుగా యమునా లహరీ తరంగముల్
మిసమిసలాడి పొంగుచు సమీప నికుంజ కుటీరవల్లితో
గుసగుస నేదొ చెప్పునవి కోమల భావ మనోజ్ఞ గీతులన్.

# అర్ఘ్యాంజలి

సత్య మహింస ఉచ్ఛ్వాస నిశ్వాసముల్
సల్పి జీవించెడి సత్యమూర్తి
విశ్వకళ్యాణగవేషణాపథమందు
పయనించు ఒంటరి బాటసారి

సత్యాగ్రహమ్ముచే శాత్రవులను
శిష్యనిర్విశేషుల జేయు నిగమరాశి
రాట్నము ధర్మచక్రము చేసి 'పరిశుద్ధ
ఖద్దరు' నిర్మించు కర్మయోగి

బుద్ధదేవుడు పుట్టిన పుణ్యభూమి
నేటికిని పునఃపూతమై నెగడునట్లు
అవతరించినయట్టి ఓ అమృతమూర్తి!
అందుకొనవయ్య మా స్వాగతార్ఘ్యములను.

కారణజన్మ మెత్తి చరఖా భుజసీమను మోసి తెచ్చి మా
భారతభూమిపై నిలువవచ్చిన దివ్యమహర్షి! విశ్వ సం
సారములో అహింసకయి సత్యముకోసముదీనమానవో
ద్ధారణకై తపస్సులు సదా వెలయింపు మజాతశాత్రవా!

నీ వడుగుమోపిన చవిటి నేలయైన
తీర్థభూమియౌను భరతదేశమందు;
నీవు పల్కిన పలుకులు నిగమభాష
యగుచు నినదించుచుండు మహానుభావ!

సేవాధర్మము మానవాకృతిని దాల్చెన్ నీ స్వరూపమ్మునన్
సేవాగ్రామతపోవనిన్ - నవనవోన్మేషమ్ము గల్పించు దీ
క్షావస్త్రమ్ముల నేయు రాట్నముల ఝుంకారమ్ములున్; నీఅహిం
సావాదమ్ములు; శాంతి దీప కళికల్; స్వాతంత్ర్య శంఖధ్వనుల్.

బుద్ధు డహింసచే భరతభూమిని క్రీస్తుకు పూర్వమందు ధ
ర్మోద్ధరణమ్మొనర్చెను శుభోదయమయ్యెను; దాస్యశృంఖలా
బద్ధులు భారతీయుల తపస్సులు పండె, స్వతంత్రమంత్ర సం
శుద్ధులు శాంతిసత్యరణశూరులు పట్టిరి నీ పతాకమున్.

ఖద్దరుపాత గట్టి చరఖా పయి నూలును దీసి పూర్వపున్
బెద్దరికమ్ము నేడు నిలబెట్టుట కోసము బందికాన ము
ప్పొద్దులు వెళ్ళబుచ్చి నగుమోమున సత్యముకై, అహింసకై
ముద్దులు మూటగట్టెడి ప్రబోధము సల్పుము దీనబాంధవా!

ఇది రవి అస్తమింపని మహీస్థలినంతయు నేలువారితో
ఎదురుగ నిల్చి డీకొనుట! ఎంతటి సాహసమయ్య!! వీరులై
కదనము చేయగా దగిన కత్తి కటారులు లేక దాసులై,
ఒదిగి; అణంగిపోయి పడియుండిరి ఇంతకు ముంద రెందరో.

పరమగంభీరమంచు నీ వాక్యములకు
భాష్యకారులు గ్రంథాలు వ్రాసినారు;
కాని! - ముగ్ధమోహనము నీ మౌనమునకు
భాష్య మొనరింపగల్గినవారు లేరు.

పూసిన మల్లె పూ లొలుక బోయుచు, చల్లని చూపుతో ఉప
న్యాససుధామధూక్షులిడ అంజలి పట్టుదు గాని నీ నిది
ధ్యాసకు తల్లడిల్లు జగమంతయు అర్థ మెరుంగలేక; నీ
బోసి మొగమ్ము విప్పుము ప్రభూ! చిరువెన్నెలసోనజల్లులన్.

మూడు కాళ్ల ముసలివాడవైనాడవు
వృద్ధవీరుడా! యి కెంతవరకు
శాంతిసమరములను సాగింపగలవోయి!
ఆగు మపుడె దూరమేగినావు!!

పకపక నవ్వుచున్ ముసలిపండువు! ఆగుము! దవ్వు దవ్వులన్
చకచక పోకు నీ అడుగు జాడల వత్తుము మేముగూడ, ఏ
తికమకలైననున్ మరచి దేశము కోసము దీక్షతో; ఒకా
నొక దినమందు ముందు తల లొగ్గును నీకు జగంబులన్నియున్.

యుద్ధము పేర ఘోరనరహోమము మొన్నటిదాక సాగె, ఆ
యుద్ధము అంతమొందె నని యూరట చెందగ శాంతి లేదు నే
డిద్ధరణిన్, ప్రజాసమితి ఇప్పటికైననుగూడ ఆత్మసం
శుద్ధిని చెందలేదు దయజూడుము దీనజనావళిన్ ప్రభూ!

'అటముబాంబు' విశ్వవిలయమ్ము ఘటించెడి త్రోవ ద్రొక్కె; ఆ
రాటము చెందుచున్నది ధరాస్థలియంతయు; ధర్మసూత్రముల్
రాటముమీద త్రిప్పి; అనురాగ తరంగితమైన వేడి క
న్నీటిని కార్చి, మమ్ము కరుణింపుము విశ్వజనీనజీవనా!

గాంధిమహాత్మ దివ్యపదకంజములంట జనావళుల్ జగద్
బాంధవ! తీర్థయాత్రకయి వచ్చిరి లెమ్మిక యూతకోలతో;
బంధములో కృశింపదిక భారతమాత; స్వతంత్ర గీతికా
బంధురమైన దుందుభిరవంబులు నింపుము బోసినోటితో.

1946 జనవరి 21 వ తేదీన, చెన్నపురికి వచ్చినప్పుడు ఆంధ్ర పత్రికాముఖపత్రముప మహాత్మునకు సమర్పించిన అర్ఘ్యాంజలి యిది.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

''శాస్త్ర విజ్ఞాన మహనీయ శక్తిచేత
సమయ సీమల, పంచభూతములనెల్ల
కైవసమ్ము గావించుకో గలిగినట్టి
నవ్యనాగరకత కభినందనములు!

కాని-యిదేమి వింత! గతకాలముకంటెను లోకమందు వి
జ్ఞానము హెచ్చురీతిగనె సౌఖ్యము శాంతియు తగ్గుచుండె, ఈ
మానవజాతియెల్ల తుదమాసెడి రోజులు వచ్చె, నవ్యశా
స్త్రానలదగ్ధమై ధరణియంతయు బూడిదయై లయించునా?

'ఆటము బాంబు' రెక్కల జలాంతరగాములు కాలకూట దుష్
కీటకవాయుజృంభణము క్రిందులు మీదులు లేక సంగరో
చ్చాటన సల్పుటన్; బ్రదుకు చావుల, దుఃఖ సుఖాల, క్లిష్ట శృం
గాటకమందు నిల్చిరి జగచ్చరితంబున నేటి మానవుల్.

యుద్ధముమీఁదనే మనము యుద్ధ మొనర్చుచునుంటి మిప్పుడే;
యిద్ధరణిన్ రణంబు లిక ఎప్పుడు నుండవు కాన సర్వలో
కోద్ధరణంబుకై అసువు లొడ్డు డటన్న - మృషాప్రబోధ సం
బుద్ధులు రెండు సార్లు చనిపోయిరి సర్వజగద్ధితంబుగన్.

ఓ నవశాస్త్రదారుణమహోగ్రకఠోరవికారఘోరవి
జ్ఞానవికాసమూర్తి! విషచారితరక్తరసప్లుతప్రభా
లీనకటాక్షమేల ప్రసరించెదవోయి! సహస్రశీర్షవం
చాననవిశ్వరూపవిలయాంతకభీకరగర్జనార్భటిన్.

ఆకాశమ్మున పక్షిపోలిక విమానారూఢశుంభద్విహా
రాకాంక్షాపరిపూర్తి; చేప వలె నీరాంతర్గతిప్రాభవ
స్వీకారంబున విశ్వజేత వగుచున్, జీవింప లే వేల భూ
లోకంబందున మానుషత్వమున? చాలుంజాలు విజ్ఞానముల్.

వేయి చేతులు పదివేల వెఱ్ఱితలలు
పిడుగు లురులు లక్ష పెద్ద నోర్లు
నిప్పు గురియు కోటి నేత్రకుండము లేల?
గుండె లేని పాడు మొండెమునకు!

దూరదర్శనమ్ము దూరశ్రవణమును
విశ్వమంత అరచు వింత నోరు
క్రొత్త నాగరకత కూర్చుకో గలిగెను
తుదకు హృదయ మొకటి కొదువ యయ్యె

'ఈ పెనుమంటిదిబ్బ వసియించి రొకానొకనాడు మానవుల్
పాపము! శేముషీవిభవపారగులై ప్రకృతిన్ జయించి వి
శ్వాపరసృష్టి సల్పి, ప్రళయాంతకబుద్ధిని గుండె లేక ఆ
త్మోపహతిన్ వినాశనము నొందిరి యందరు జ్ఞానశూన్యులై.

అనుచు హతశేషమై యంత అవని మిగులు
ఏ పిపీలికలో రచియించు కొనుచు
కరుణగీతులను తమ వాఙ్మయములోన
ఇయ్యది అవశ్యభవితవ్య మేమొ మనకు."

"ఎవరవు నీవు? నీ హృదయ మేల ద్రవించుచునున్నదిట్లు వె
న్నవలె కరంగి; కోమలమనస్కులు చూడగ లేరు నేటి పా
శవదురహంకృతుల్ సలుపు స్వార్థపరత్వకఠోరఘోరమా
నవమఖహోమధూమనవనాట్యచలద్వికటాట్టహాసముల్.

భూతలమే శ్మశానమయి పోయె చితోద్గతకాలధూమరే
ఖాతిమిరమ్ములో అలతి కాంతుల నీనెడి నెత్తు రెత్తి దీ
క్షా తిలక ప్రసాధనము సల్పుము తద్రుధిరార్ద్రశోభ ప్రా
భాతమరీచివీచులయి పర్వును నూత్నయుగోదయమ్ముగన్.

ఈ దృశకాలబాధ గతియించినయట్టి చరిత్ర లేక పో
తే దెదిరించి నిల్చెను చలింపక మానవజాతి భావి భా
గ్యోదయదృష్టితో; నవయుగోదయమందున ఈ ప్రసూతికా
వేదనలన్ని ఎట్లనుభవింపక తప్పు ధరాసవిత్రికిన్?

అణు పరమాణు భేదన మహాప్రళయాగ్ని ముఖాంతరాళ మా
రణనవకీలదారుణకరాళవిజృంభణ కాదు సుమ్ము తూ
ర్పున వికసించు ఎఱ్ఱ మెఱుపుంగమి నవ్యయుగోదయప్రభా
రుణకిరణమ్ములే యని నిరూపణ జేయవె ఆర్తకోటికిన్.

స్వాదుకవిత్వసంభరితశాంతిసుధారసగాననిర్ఝరీ
నాదము నింపుచుండుము మొక నాడధికారికి ఈ జగద్ధితా
వేదన గుండెలోన ప్రభవింపక పోదు నవీనసభ్యతో
న్మాదమహాజగత్తు వినినన్ వినకున్నను చిన్నబోకుమా!

కాగి తపించు లోకము వికావిక లౌచు పృథా మనోవ్యథన్
వేగయి మూల్గుచున్ పఱపరింపగ శాంతరసస్రవంతికా
స్వాగతదివ్యసూక్తములు పాడెడి ఓ అమృతార్ద్రగీతికా
యోగతపస్వి! అల్లుకొను ముత్తమవిశ్వజనీనగేయముల్.

సకలధరణీశాసనపరిషత్తుతోడ
ప్రజలు వసుధైకసామ్రాజ్యపౌరులగుచు
భూమి యేకకుటుంబమై పొందునంది
విశ్వమానవకళ్యాణవేది యగుత.

# నిరీక్ష

అడుగు సవ్వడు లంచు ఆసతో పరికించి
నిట్టూర్పు బరువుతో నిలిచి పోవుచునుంటి
కలికి చూపుల వెల్గు లొలికింపరావా ?
చిన్నారి చిరునవ్వు చిందించి పోవా ?

అందాలు చందాలు అల్లాడు అపరంజి
కిరణాల నారింజ కెంజాయ వసనాల
ప్రత్యూష పవనాల ప్రాచ్య దిక్కునుండి
కదలి వచ్చెద వంచు కాచుకొని యున్నాను.

నీకోసమై యిచట నే నిలిచి మతిపోయి
పవలెల్ల కలలతో పలవరించుచునుండ
మలిప్రొద్దు వెలుగులో మందమారుత మట్లు
నా గడపవద్దకే నడచివచ్చితి వీవు.

శూన్యబుద్ధిని నేను చూడలేదప్పుడు
మాట లాడక నీవు మరలిపోయిన వెనుక
వేడి కన్నీటితో విలపించుచున్నాను;
తీపి కలలునుగూడ తేలిపోయిన విపుడు.

# ఆనందసూక్తము

ఆయువు గల్గు నాల్గు గడియల్ భువిమీద ప్రమోదహావ భా
వాయతనేత్రదీధితుల ఆడుచు పాడుచు నవ్వుకొంచు లో
కాయతనం బొనర్పు జగమంతయు ఈశ్వరచిద్విలాస తే
జోయుతతన్మయత్వమున సొంపులు నింపును పువ్వుటీరమై.

ఆనందోల్లసనమ్మునన్ మధురగీతాలాపనన్ సుందరో
ద్యానామోదవితర్ది జేయుము భువిన్; దౌర్జన్యదంష్ట్రాగ్రహిం
సానాట్యమ్ము నెదిర్చి నిల్వుము దయాశౌర్యమ్ముతో; ఈ పురా
క్షోణిన్ మానవజన్మ గల్గెనని ఔత్సుక్యాన గర్వింపుమా!

లీలానందచిదార్ద్రరాగరసలాలిత్యమ్ము నిండార భూ
గోళమ్ముగ్ గ్రహతారకానివహమున్ గూర్చెన్ జగత్స్రష్టయౌ
కేలీతాండవమూర్తి; విశ్వమయసంగీతామృతాంతర్ఝరీ
హేలాయోగలయాప్తి నీ బ్రదుకు సంధింపన్ బ్రయత్నింపుమా!

ఈ మహి వింతసత్ర మిట నించుక సేపు వసించి పోవు వా
రీ మనుజుల్; వృథా వ్యథల నేల తపింప? ప్రమోదశీలివై
యే మమకారమున్ గొనక యీ యిహనాటకరంగమందు నీ
భూమిక నిర్వహించుటకు పూనుము నేర్పున మేలుబంతిగన్.

నీ సహజన్మ్ములన్ గలిసి నిర్మల సుందర మందహాస రే
ఖాసుకుమారతల్ విరియుగా సుఖియింపు మనోజ్ఞగానవి
న్యాసతరంగితంబయిన నాట్యవినోదమునందు మంగళా
శాసనమున్ పఠించు నిముషంబుల దాక రసజ్ఞమూర్తివై!

# ఆనంద శ్రుతి

ప్రణయలతికకు సంగీతరాగమధురి
మమ్మకాలవసంతాగమమ్ము గాన
పడుచు క్రొవ్వేడి నిట్టూర్పు బరువు పాట
పాడవోయి గుండె కరంగి వాగు గాగ.

నింగి చిన్నారి మలి పొద్దు నీలి తెరల
కావలి జగత్తుల కెగిరి పోవు పసిడి
రెక్కల పడుచు కలలుకై పెక్కు పాట
ప్రకృతి పులకింప కమ్మగా పాడవోయి.

సుందరతన్ కనుంగొనినచో మృదుగానము నాలకించినన్
డెందము కొంత వా గయి వడిన్ ప్రవహించును; పొంగులెత్తి ఆ
నందము మేలుకొల్పును మనఃకుహరాంతరసుప్తవాసనా
బృందము; కందళించు వచియింపగ లేని పురానుభూతులున్.

పదమునకు గల అర్థము పరిమితమ్ము
వివిధభాషలు విలసిల్లు విశ్వమందు
గుండె మాటాడ వేరొక గుండెతోడ
గాన మెల్ల మానవుల కేకైకభాష.

పరవశత్వము చెంది పడగ విప్పుచు నాడు
నాగస్వరము విన్న నాగుబాము
కోయని కవ్వింప కోయని కోయిల
కూయుసాగు వగరు గొంతునెత్తి
కమ్మని వేణుగానమ్ము విననయంత
పశువులు బ్రమాన్పడి పాలు చేపు
అల్లరి పిల్లలున్ హాయిగ పవళింత్రు
జోల పాడిన వేళ గోల మాని

జంత్ర గాత్ర సమ్మేళన స్వర విలీన
మధుర సాహిత్య సంగీత మార్దవాన
మెదడు గలిగిన మనుజుల హృదయ మేల
పొంగిపో దమృతరసతరంగిణిగను?

దుఃఖసౌఖ్యవిదూరమై తోచునట్టి
మృదులశాంతి గాన మనుగ్రహింపగలదు;
బీట వాసిన యీ గుండె ప్రిదులు ముందు
పాడు; పూవుటుయ్యేలతూగుపాట నొకటి.

పాటలు విన్ననా డయిన; బాధలతో కృశియించి వేడి క
న్నీటిని గార్చి పాడువడనీయక, ఈ బ్రదు కొక్క మల్లె పూ
దోటగ, తావి తెమ్మెరల తూగు టుయాలల యూపులందు స
య్యాటల నాడనిమ్ము హృది నార్చెడి తీరని తీపికోరికల్.

గానము విన్నచో, ఎడద గ్రమ్మిన కమ్మదనమ్ములో, అవా
జ్మానసవేద్యమైన సుకుమారగభీరవిశాలదివ్యభా
వానుభవ మ్మెదో పుడమి కవ్వలి వెల్గుల త్రోవ చూపు; స
ద్ధ్యానివృతప్రసన్నరుచిరోజ్వల హర్షమహాసమాధిలో.

# ఉగాది సుహృదభినందనము

ఆమని వేప పుష్పాడి, రసార్ద్రమనోజ్ఞనవీనతింత్రిణీ
కోమలశర్కరారుచులకున్, కదళీఫలపాకసిద్ధికిన్;
మామిడి పిందె లేవగరు మాటిడి, క్షీరమధుస్రవంతికా
భూమి కుగాది తెచ్చు సుఖభోగులు గందు తెలుంగు సోదరుల్.

బంగరు కలలు హృదయాన రంగరించి
రెక్కలు పొదుగు ప్రాత కోరికలనెల్ల
క్రొత్త సంవత్సరంబొనగూర్చు మీకు ;
అందుకొనుడు; ఈ సుహృదభినందనమ్ము.

శాంతిసౌఖ్యాలకై ప్రపంచమ్మునెల్ల
వెదకి తుదకెండమావుల వెంబడించి
దారి తప్పిన ఓ బాటసారులార
స్వాగతము మీకు మా పర్ణశాలకడకు.

కోరుకొనిన కోరిక సీతకోకచిలుక;
పట్టుకొనబోయి వెనువెంట ప్రాకులాడ
చేతికందదు గాని నిశ్చింతతోడ
వదలి కూర్చున్న వచ్చి పై వ్రాలవచ్చు.

స్వాగతము నీ కతిథిదేవ స్వాగతమ్ము
సహృదయసుహృద్వరులకు సుస్వాగతమ్ము
నిజము సాప్తపదీనమ్ము స్నేహనిరతి
ప్రణయవిజితు లగుదురు శాత్రవులెయైన.

ఇది కవితాప్రభాస; వసుధైకకుటుంబి కవీంద్రు సాహితీ
సదనము; కావ్యశిల్పమయశబ్దతపోమఖశాల; ఆర్ద్రసా
హృదసుకుమారభావుకుల కెల్లరకున్ రసరాజధాని; తె
ల్గుదనపు సోయగమ్ములు వెలుంగుత ఇంక జగద్ధితమ్ముగన్.

చూతఫలోద్గమమ్ము, వనసుందరి పూవుల మేల్ముసుంగు కై
సేతలు మల్లెలే పలపు సిగ్గుల వెన్నెల లొల్కు ప్రసా
పేతము గాగ మా తెలుగు బిడ్డల జీవితమెల్ల దిద్ది, ఈ
నూతనవత్సరంబిక మనోరథసిద్ధు లొసంగి యేగుతన్.

ఆమని కన్నెమొగ్గల ఒయారము లెచ్చట మోసులెత్తినన్
ప్రేమసముద్రమై పులకరించెడి నీ హృది పూలకోవెలన్,
నీ మృదుచంద్రికాప్రణయినీమధుదేవికి కట్టుకొమ్ము; ని
కోమలగానవాహినులకున్ కయిమోడ్ప రసప్రపంచముల్.

# శకుంతలా నిర్గమనము

ని సుకుమారపాద మవనిఁ బెట్టితి వెట్లు, దీర్ఘ ని
శ్వాసముతో; కుశాంకురము పాపము! గ్రుచ్చుకొనెన్; తపోవనా
వాసములోన ఈ గడుసు వంకల నల్లుట గూడ ఎప్పు డ
భ్యాసము చేసినావు? నవయౌవనమే తెలుపున్ హొయల్ వగల్

ఇంక మహావకాశము లభించెను; సిగ్గులు చిందిపోవ ద
ర్భాంకురముల్ పదాబ్జములయందున నాటిన వంకఁ బెట్టి, నీ
వంకర యోర చూపుల ప్రవాహము పొంగుచు పారనిచ్చి, ని
శ్శంకగఁ జూచుకొమ్ము నృపచంద్రుని ఏమి యెరుంగనట్లుగన్.

దర్భపల్లవము భవత్పదమ్మునందు
గ్రుచ్చుకోలేదు - కాని, నీ కోరచూపు
చిలిపి చిన్నారి టక్కరి సిగ్గులెల్ల
గ్రుచ్చుకొన్నవి దుష్యంతు గుండెలోన.

కదలిన తీపికోరికల కమ్మని బాధల రేగినట్టి లే
హృదయము మాటలాడ తమకించిన యంతట నేత్రదీధితుల్
పెదవి కదల్పకుండగ కవిత్వము లల్లును; వాఙ్మయమ్ములో
పదములు చెప్పలేని రసభావవిచిత్రమనోజ్ఞవైఖరిన్.

ఆ దుష్యంతుడు వచ్చివెళ్లెను; పరధ్యానంబుతో నిండి నీ
వేదో మాదిరిగా కనంబడుదువు వేమీ ? నీ కుటీద్వార మం
దా దూర్వాసమునీంద్రుడే నిలువగా ఆతిథ్యపూజాదిమ
ర్యాదల్ సల్పవు; ఎంత తియ్యని మనోరాగంబు నిన్ గ్రమ్మెనో;

గుండె తడి లేని జడదారి గొణుగుకొనుచు
తరలె ! పోనిమ్ము ! నీ పరధ్యానమందు
సార్వభౌముని యుంగరమునుగూడ ఎచటొ
విడిచిపుచ్చెద వేమొ ! ఓ వెఱ్ఱి పిల్ల !

ఎంతటిలోన నీ హృదయ మిచ్చితి నీ హృదయేశ్వరుండు దు
ష్యంతుడు రాజధాని కని సాగె, అమాత్యుల నిన్ను దేరఁ బు
త్తెంతు నటంచు పల్కెను; గతించెను చెప్పిన రోజు; సత్యవృ
త్తాంతములన్ గ్రహింపగల దక్షుడు కణ్వుడు వచ్చె వల్లదే !

పెంచెను పెద్ద చేసె నిను ప్రేముడితో; ఎదురేగి పాద్య మ
ర్పించ విదేల వచ్చు వెనువెంటనె, ఏమని కాశ్యపర్షి లో
నెంచు ? నమస్కరింపు మిక ఏమి యెరుంగని యట్లు పోయి; దీ
వించును యౌవనోదయనవీననివేశము నెంచకుండగన్.

వృద్ధగౌతమి పాద్యమ్ము నిచ్చి, అదిగొ
అగ్నిశరణము చేరె మహర్షివెంట;
అడుగుచున్నాడు కాశ్యపు డామె నెదొ
నిన్నుగూర్చియె కాబోలు! నిమ్నహృదయ

అదుగో! తెల్లని వాలు గడ్డమునపై అల్లాడు నేత్రద్యుతిన్
పడిగా వచ్చెను కణ్వమౌని యిటకే; పాదాబ్జయుగ్మంబుపై
పడినావిప్పుడు! బాష్పబిందువులనే పాద్యంబుగాఁజేసి, "నీ
కడుపున్ పండును చక్రవర్తి యగు అగర్భేశ్వరుం గాంచుమా"

అంచు మానివల్లభుడె దీవించి పోయె;
ఎంత సమయోచితముగ వర్తించినావు!
ఏమి అపుడె ఏ లోకాన కేగినావు!
వేగుచోకయా యిదియె నీ విరహమునకు?

గౌతమిఁబిల్చి, సంక్షుభిత గద్గదకంఠముతోడ బాష్పసం
ఘాతము చిమ్ము కాలు తెలి గన్నులతో పురుషార్థసూక్ష్మవి
జ్ఞాత మహర్షికణ్వు డనుశాసనమున్వినిపించె; నీ మనో
నేతను జేరబోగలవు నే డిట వీడ్కొను మింక ఎల్లరన్.

కమ్మని రాజచంద్రుఁ బిగికౌగిటికిన్ వశమైన ఆ ముహూ
ర్తమ్మునసే తపోవనికి దప్పులదానవు. కణ్వు డెంత ప్రే
మమ్మున పెంచుకొన్న నిను; మంచిది లెమ్ము, నవోఢ భర్తృగే
హమ్మునసే వసించుట, ప్రయాణము గమ్మిక సత్వరమ్ముగన్.

కూడిరి ఆశ్రమౌకసులు గుంపుగ గానుగచెట్టునీడ నిన్
వీడుకొనంగ; చెప్పితివె పెద్దల కందరకున్ యథావిధిన్;
తోడుగవచ్చు గౌతమియు; తొందరగా పయనింపగా వలెన్;
వాడిన దేల నీ వదనపద్మము వెళ్లెడివేళ కవిథిన్?

అల్లరి పిల్ల నీ చెలి ప్రియంవద; నీ చెవిలోన చేరుచున్
మెల్లగ ఏమి చెప్పె? మిరుమిట్లను గొల్పి వెలుంగు మందహా
సోల్లసితంబులౌ కనుల నొయ్యన త్రిప్పుచు వేరి సప్తలా
వల్లరి పుష్పగుచ్ఛము లుపాయన మిచ్చి తటిల్లతాంగియై.

అదుగో! వచ్చెను చెంగుచెంగునను దీర్ఘాపాంగముఁ; త్రాగ నే
రదు క్రొందామరపాకులో నునిచి గారాబాన నీ చేతితో
ఉదకంబిచ్చిన గాని; చూడు మిది యేమో నీవె యీ లేడి కం
దుదలుఁ చెమ్మగిలెఁ గదా యెడద లోతుల్ గాన రా వేరికిఁ!

"పెంచిన ప్రేమచే విడిచి పెట్టగ లేని మమత్వపాశముల్
త్రెంచగ లేక నే పలవరించితి నే; గృహమేధి నెంత బా
ధించునొ కన్నతీపి పతి యింటికి క్రొత్తగ ఆత్మపుత్రి నం
పించెడి వేళయందనె" మునీంద్రుడు కన్నుల నీరు గ్రమ్మగన్.

అడుగు పడ దేల ముందు ? మహర్షి యెదుట
ఇంతగా విలపించెద వేల నీవు ?
వెళ్ళుచున్నావు నీ ప్రాణవిభునికడకు
నిజముగా వచ్చెనా కంటి నీరు నీకు ?

చకచక సాగిపోవునదె శార్ఙ్గరవుండు! విలంబమేల ? నీ
విక పదముల్ రయాన కదలింపుము; గౌతమి యేది? ఆమె ముం
దె కలదు; మార్గమధ్యమున నీ హృదికిన్ గిలిగింత పెట్టు కో
రికగమి జారనీయకుము వ్రేలికి పెట్టిన యుంగరమ్మొటః.

ఆ సరస్తీరవృక్షములందునున్న
కాల్నడ మలుపులో నీవు కానరావు;
ప్రకృతి వేడి నిట్టూరుపుల్ పరగఁజేసె
చిన్నబోయిన ఆశ్రమసీమలోన.

# పుష్పబాణవిలాసము

చెలువ యొకర్తు, నాథు దరి జేరి విలోలవిలాసయై ఉష
స్సుల వికసించి మించి సొగసుల్ విరజిమ్ము తుషారబిందుతుం
దిలమగు లేగులాబి, పసినిగ్గులబుగ్గను చేర్చి చూపి, ఏ
చెలువము నీకు ఎక్కువ రుచించు నటం చడిగెన్ హసించుచున్.

కాంత నుడికింపఁదలపోసి కాంతు డపుడు
మెచ్చుకొనియె గులాబియే మే లటంచు
అంత భ్రుకుటీవిభంగయై అతివ కనలి
విభుని రివ్వున పువ్వుతో విసరికొట్టె.

# మాతృదేవి

ఊయెలలోన పాప నిడి ఊచుచు తియ్యని జోల పాటతో
హాయిగ నిద్రవుచ్చు సమయంబున పొంగుచు విశ్వసృష్టిభ
ద్రాయతమైన మాతృహృదయమ్ము వహించెడి అందముల్ వినా
యీ యఖిలప్రపంచమున ఏమి స్ఫురించును నిత్యసత్యమై ?

చీకటినీడగుంపులు వసించెడి క్రుళ్లిన వల్లకాడు ఈ
లోక మటంచు నెంచ కెదలోపల; మాతృకృపారసస్మితా
లోకమనోజ్ఞవీచికలలో; అరవిచ్చు గులాబి నాట్యహే
వాకములోన చూడు తెలవారిన అందము లెన్ని చిందునో.

# త ప స్వి ని

పర్ణశాలావితర్దికాప్రాంగణమున
పొగడ చెట్టు కొమ్మను చేతబూని నిలిచి
నావు ! కుశలమౌనే నీకు ? నాగుపడుచు
తపసి యిల్లాల ఓ జరత్కారుగృహిణి !

బ్రహ్మతేజస్సు కనులలో ప్రతిఫలించు
వేదవేదాంగవిజ్ఞానవిమలమూర్తి
భర్తగా అదృష్టవశాన పడసినావు;
క్రొత్తకాపుర మెటు దిద్దుకొనెదొ నీవు !

గృహిణి చేతితో గీసిన గీటు దాటు
లేని లంపటుల్ కాలేరు మౌనివరులు;
మనసు నెరిగి మసలు సుకుమార ఫణవతి
తప్పరాదని అలనాడె చెప్పలేదొ !

దండకమండలుల్ గొనుచు దర్భల చాపను చంకఁబెట్టి, యా
మండెడి యెండలోన మునిమండను డల్లదె చెట్లగుంపులో
నుండి యిటే నడకఁ మరలుచుండెను. వ్రేల్మిడి వచ్చు మత్తవే
దండము భంగి; స్వేదజలధారలు కణబొమలఁ స్రవింపగఁ

మునిముని తేత నవ్వు తెలి ముత్తెపు సిగ్గు లణంచుకొంచు తా
పసి కెదురేగి మెల్లమెల పాద్యము నిమ్మ; భవద్విలాస సా
ధ్వసములలోన కొత్తగరువంపు నిదానము తెచ్చుకొన్నచొ
మసలగవచ్చు నా ముని సమక్షము నం దసిధారపై వలెన్.

చల్లని నీరు దెచ్చి, మునిచంద్రుని పాదములందు బోయుచున్
మెల్లగ కొంగుతో తుడిచి, మిక్కిలి భక్తి వెలార్చినావు, సం
ఫుల్లముఖారవిందుడయి పూజ్యుడు దర్భల చాప విప్పి, ఓ
పల్లవపాణి నీ తొడలపై తల మోపెను నిద్రవోవగన్.

చండకఠోరకోపనుడు చయ్యన కన్నొమ విప్పినంత, బ్ర
హ్మాండము దిర్దిరన్ తిరుగులాడు చలించు; శిరస్సుక్రిందునన్
దిండు త్యజించి నీ యొడిని నిద్దుర పోయెడి! ఎంతవారికిన్
పెండిలియైన ప్రాబిరుసుబింకము క్రుంగక తప్పదెప్పుడున్.

పడమటి కొండ నెత్తమున భానుడు వ్రాలెను; నిద్రలేవ బో
వడు ఋషి; నీవు మేల్కొలుపవచ్చునొ రాదొకొ! సంకటమ్ములో
పడితివి; సాంధ్యకృత్యములు వాయునొ! లేపిన నిద్రభంగమౌ!
కడ కెటొ మేలుకొల్పితివి; కాంతకు కాంతుడు లోకువే సదా!

"భంగము కల్గెనా నిదురవాటుకు; చెప్పిన మాటచొప్పుకున్
భంగము కల్గె; సూర్యభగవానుడె యెట్టుల సాహసించి అ
స్తంగతుడౌను నే నపరసంధ్యను వార్చక నిద్రవోవగన్;
వెంగలివీవు లేపితివి పిఱుడి నంచు తలంచితే సతీ!

క్లిష్టసంసార నిద్రలో కీలుకొనిన-
మేలుచేసితివీవు నన్ మేలుకొలిపి;
నింతుచూలాల విప్పుడు నీవు; పుత్రు
డుభయకులదీపకుండు నీ కుద్భవించు."

అని ముదిరిన కినుక గదుర
మునివరుడు పలికె కనుబొమ ముడివడి క్రుంగన్
తన అవమానస్ఫూర్తిని
కనలిన గద్గదకషాయకంఠముతోడన్.

చరచర సాగిపోయె మునిచంద్రుడు, దండకమండలుల్ కుశా
స్తరణము తీసికొంచు నుటశాలను వీడి హుటాహుటిన్; సదా
విరహము తప్పదింక ! మది వేదన చెందకుమమ్మ, జ్ఞానభా
సురమహిమోజ్వ్యలుండయిన సూనుడు నీ కుదయించు శీఘ్రమే.

వనిత కన్యాయమని యేమొ పలుకుచుంద్రు
భార్య కొంగు వదల లేని భర్తలెల్ల ;
ధన్యు డాతడు సంసారతాప ముడిగె ;
ఇంత చని బ్రహ్మవిద్య సాధించుకొనును.

చచ్చిపోవునందాక విజ్ఞానధనులు
సతుల పిరుద తిరుగ లేరు మతులుపోయి ;
చారితార్థ్యము మాతృత సత్సతులకు
తల్లి వగుచుంటి కనులకు ధన్యురాల !

# శీర్ణ మేఖల

ఈ నడి రేయిలో ఇభపురేశ్వరు అంతిపురాన, హర్మ్య సో
పాన పరంపరాగ్రములపైన కెకాయెకి ఎక్కు ఎవ్వడీ
మానిసి ? రాణి భానుమతి మందిరరత్నకవాటకాంతిలో
ఆననసీమ వెల్గెడిని ! అంగధరేశుడు సూతసూనుడే ! !

అనుగు సఖుని దుర్యోధను నరయుకొరకు
పవలు రే లనక అతడు వచ్చుచుండు;
కంటికిని కూర్కు లేకుండ కాచుచున్న
ద్వారపాలకు లెవ రాప నేర రతని.

అంత కవాటముఁ దెరచి ఆతడు లోనికి ఏగినంత, ఏ
కాంతవినోదకేళి, చెలికత్తెనుగూడి, సుయోధనక్షమా
కాంతుని కాంత, హైమమణికల్పితసుందరతల్పమందు, అ
త్యంతనివేశనిష్ఠ చదరంగము నాడుచునుండె నమ్మెయిఁ.

వెలుగు నీడల గళ్లలో వెలసి; మణి కు
యోభయ తురగ గజ భట వ్యూహరచన
రత్నదీపాంకురప్రభారాగపంక్తి
మెరయుచుండె కన్నుల మిరుమిట్లు గొలుప.

అంగధరాతలేశ్వరుని ఆగమనమ్మును గాంచి, వారలున్
చెంగున తల్పపీమ డిగి చెంతను నిల్చిరి; సూతసూనుడున్
బంగరు పీఠిపై నొడలు వ్రాలిచి మెల్లగ విశ్రమించె; ఆ
అంగనలున్ తమిన్ తిరిగి ఆటకు చేరిరి తోడుతోడుతన్.

"ఎచ్చట కేగినాడు ధరణీశ్వరు" డంచు నతండు దేవినే
నెచ్చెలి కోసమై అడిగె, నెమ్మదిగా మరుబల్కె నామెయున్;
"చెచ్చెర వత్తునంచు చనె శీఘ్రముగా నెటొ, పాదచారియై;
వచ్చుచునుండు నంచు మది భావన చేసెద వే ప్రతీక్షమై."

"పోయెద నంచు" పల్కి చనబోయెను పీఠమునుండి లేచి రా
ధేయుడు; దేవి భానుమతి తెల్పెను "వచ్చెడి వేళ యయ్యె, ఈ
రేయి భవత్సఖుండు నిదురింపరు మీ గమనమ్ము విన్నచో
పోయిన దేమి; ఆగుడు ప్రభుడిందె వచ్చుచునుండు వ్రేల్మిడిన్.

అని బదులాడి దేవి చదరంగము నాడుట కుద్యమించి నే
ర్పున చెలి ఆట కట్టుటకు పూనినయంతట కర్ణు, డల్ల న
ల్లన సఖివైపు చేరి పదిలంబుగ రాజును గాచి దేవి ఆ
టనె కదిలించివైచెను హుటాహుటి వారణచారణమ్మునన్.

కర్ణు డంతట ఆ చెలికత్తె స్థాన
మాక్రమించి తల్పమ్ముపై నధివసించె;
ఊడిగంపు చెలియ ప్రక్క కొదిగి నిలువ
ఎత్తుపైఎత్తుల ఆట సాగించి రంత.

ఎంతటిమాట ! హస్తినగరేశ్వరు పట్టపురాణి యట్టు లే
కాంతగృహమ్ములోన నిజకాంతుడు లేని నిశీథి, ఏక శ
య్యాంతరవర్తియై తమిని అన్యునితో చదరంగ మాడు నా
ఎంతను తొంగిచూచె వినువీథిని తారలు పుల్కరించుచున్.

కౌరవచక్రవర్తి తన కర్ణుడు ప్రాణసమానుడంచు శృం
గారగృహమ్ములో చనువుగా ప్రియమార ప్రవేశ మిచ్చి ఇం
పారగ గౌరవింప మరియాద గణింపక రాజరాజు దే
వేరినిగూడి ఆడు నృపవేశ్మమునందున సాహసమ్ముతో.

అది చదరంగమందుగల అద్భుత తన్మయశక్తి ఎప్పుడున్
మెదడు తదేకనిష్ఠమయి నిల్వగజేయును; హస్తియుగ్మమున్
కదిపి హుటాహుటిన్ మెరసి కౌరవరాజ్ఞి బలమ్ము చీల్చి అ
భ్యుదయము చెంది గర్వభరితోక్తుల నెమ్మది సంభ్రమింపగన్.

"త్రోసిరాజో ! లే కుయ్యాల త్రోసిరాజో !!
కోరుకొను మం"చు కర్ణుడు గ్రుచ్చి గ్రుచ్చి
పౌరవేశ్వరు రాణిని ప్రశ్న వేయు
చుండ మెల్లెక్కుచుండె దుర్యోధనుండు.

ద్వారము వెన్కనుండి; మదవారణయానమనోజ్ఞమందగం
భీరవిధాన మేడపయి మెట్లను ఎక్కుచు వచ్చుచున్న ఆ
కౌరవనాథు భానుమతి గాంచి, తటాలున ఆట వీడి బం
గారపు పట్టు పాన్పు దిగ కర్ణుడు కొంగును బట్టె నిల్పగన్.

క్వణదణు కింకిణీ కలిత కాంచన మేఖలలయ్యె, ఝుళంఝుళ
స్మరణిమయశింజినీ ధ్వనుల మార్మొగమై విదలించె ఆమె కొం
గును; అపరంజి కాంచి తెగి కూలెను కర్ణుని హస్తవేగ చా
రణమున, హేమరత్నమణిరంజితకోమలకుట్టిమమ్మునన్.

కర్ణుడెదుటనున్న కౌరవాధీశుని
ప్రాణమిత్రుని మోము నరయ లేక
హైమకాంచిని వీడి అందందు పడిపోయి
చెదిరిన మణు లేర చేయిరాక
స్తంభించి నిలిచిన సతి కురు పట్టమ
హిషి అవస్థ మది నూహింప లేక
ఏమి యెరుగకయె ఇంతలు సలిపిన
తన్ను గూర్చి తన కర్ణమ్ము గాక

కనకతల్పము జారిన కర్ణు హృదయ
మందు విద్యుల్లతారోచి అశనిపాత
మగ్నిపర్వతజృంభణ మబ్ధిఘోష
ధరణికంపమ్ము లేకమై తాండవించె.

మందమనోజ్ఞహాససుషమామృదుభావమరీచివీచికల్
కందుదలందు వెల్లిగొన కౌరవనాథుడు ఆత్మదేవికిన్-
చిందిన మేఖలామణుల చెచ్చెర నేరి యొసంగి "ఆగ్రహం
బందిరొ రాణివారు క్షమ కర్హుడు నా ప్రియమిత్రు డిమ్మెయిన్.

ఎరిగి చేసిన తప్పుగా దెంత వారి
కైన క్రమ్మను చదరంగమందు మత్తు;
ఎప్పటియటుల కష్టు మన్నింపు" మనుచు
ప్రార్థనలు సలిపె ఛలోక్తి పరిఢవింప.

అనునయ మొంది రాణి అధరాంచలమందలి లేత నవ్వు వె
ల్గును మృదులాంగుళీగ్రసిత కోమల పక్ష్మములం దణంచి యూ
ర్చును; కురుచక్రవర్తి తన స్నేహితు జేకొని మేడమీదికిన్
జనె; నును సోగ వెన్నెలల చల్వలు గ్రమ్మె ధరాతలమ్మునన్.

వెన్నెలలకంటె చల్లని వెలుగు వెల్లి
విరియు సుకుమారహృదయపవిత్రమైత్రి
ఎల్లలోకాలలో ప్రసరింపసాగె
అమృతరోచు లాచంద్రతారార్కమౌచు.

## వ య స్వి ని

పెదవులు దాట లేని మృదువేదన వేగిన తీపికోర్కె యె
య్యేది చెలరేగి నీ హృది దహించుచునున్నది ? ప్రాలు సోగ కం
దుదలను గ్రమ్ముచున్న తడితో బదు లాడవు ? ఊర్పుగాలులన్
చెదరిన పైటచెంగు సరిచేయవదేల ? అధోవిలోకనా !

నీ ముఖనర్మహావమృదునిశ్చలరేఖలు గాంచినంతనే
కోమలభావవీచికలకున్ గిలిగింతలు పెట్టునట్టి మా
మామిడితోపులో కొలమమధ్య సువాసన లీను పద్మినీ
హైమవిభావరీవిరహయాతన జ్ఞప్తికివచ్చు నేలకో !

కనుగవ కెంపువారినది, కస్తురిబొట్టు చెరంగె; వాడిపో
యెను జడ మల్లెచెండు; కురులెల్లను పాపటపై చరించు; త
మ్మని కనువేదురేదొ ! సుకుమారమనస్విని ! నిన్ను నిండు జ
వ్వనమున వేగుబోకపలవంతల ద్రోసినదా ? గ్రహించితిన్.

ప్రణయసిద్ధి గాంచని అనురాగరక్తి
ఆపుకోలేని పడుచు ప్రాయమ్ములోన
చిలిపి నవ్వులు చిన్నారి సిగ్గులొలికి
ఎవని కర్పించినావు నీ హృదయ మతివ ?

నేనె భవత్సమీపమున నిల్వగ చూతవు! ఏమిటీ పర
ధ్యానము! పొంగువారు పదునారు వసంతము లద్భుతమ్ముగన్
నీ మును బుగ్గ సొట్ట జిగి నిగ్గులలో వికసించె; ఏది, నీ
ఆనన మెత్తి నన్ను గనవా? మధురప్రణయోపజీవినీ!!

దాచిన దాగ దీ విరహతాపము; నాలుక చెప్పలేని ఆ
లోచన లన్ని వాల్గనువెలుంగుల వెన్నెలదారులందు దో
బూచులనాడి తీపివలపుల్ ప్రసరించెడి; చేరరమ్ము; సం
కోచ మికేల పట్టుజడకుచ్చులు పయ్యెదపై నటింపగన్.

మా కవితావధూటి సుకుమారమనస్వితకొంత కొంత నీ
లో కనుపింప నా యెడదలోన అనిర్వచనీయమాధురీ
వ్యాకులగీతికల్ సుడులు వారె, ఎవో మృగతృష్ణలుఁ మరే
వో కలలుఁ సదా తరుముచున్నవి నా బ్రదుకుఁ మనోహరీ!

నీ విక నిల్చియుండెదవు నిత్యవసంతహాసమ్మ్రుఖీ! చిరం
జీవినివై తెలుంగునుడి చెల్వము పిందెడి యంతకుఁ; ప్రియం
భావుకమోహనప్రణయమానసవీథి; ఉషస్తుషార శో
భావిలసద్వపుర్నవనవస్ఫుటకోమలరాగరేఖలఁ.

# వే ణు గీ తి

అల్లరి పిల్లవాడ వని అంతలు ఇంతలు చేసి చూపి వ్రే
పల్లెను ఆడిపోసికొనువారలె అందరు నిన్ను; లేత జా
బిల్లి వెలుంగులున్ నెమలి పింఛెముతో యమునానదీతటిన్
పిల్లన గ్రోవి నూది వినిపింపుము మోహనరాగమాధురుల్.

నల్లనిమేనికాంతి యమునాసలిలాలకు వన్నెవెట్టగా
పిల్లన గ్రోవితో నెమలి పింఛెము చిందులు త్రొక్కుచుండ ఈ
చల్లని గాలిలో పొదల చాటున పూచిన పొన్నలన్ వని
వల్లరులందు మంజులరవంబులు నింపుచు తాండవింపరా!

ఈ దయనీయ నేల కరుణింపవు? ఈ మలిసంజవెల్గులో
ఊదకుమోయి నీ మురళి; ఊదిన నోర్వని లేతగుండెకున్
నీ దరహాసచంద్రిక అనిర్వచనీయమనోజ్ఞమాధురీ
వేదన తెచ్చిపెట్టు; స్థిరవిద్యుదపాంగవిశాలవీక్షణా!

# ప్రేయసి

స్వాగతము ప్రేయసీ! స్వాగతము స్వాగతము
జగదేక సుందరీ! స్వాగతము స్వాగతము
ప్రియతమ ప్రణయినీ! ప్రేమస్వరూపిణీ!
వసుధైక మోహినీ! స్వాగతము స్వాగతము

బంగారు కలలతో రంగారు చీకట్ల
నింగి మబ్బుల నీలనేపథ్యమున పరలు
సర్వాంగ శృంగార చక్రవర్తిని వీవు
సంగీత సాహిత్య సార్వభౌముడ నేను ...

వేవేగ దరిచేరి విరహార్తు సముద్ధరించి
కౌగిలింపుము రాణి కామరూపిణి దేవి
ఒకసారిసోక నీ సుకుమార హస్తమ్ము
సమ్మోహ నాస్త్రమ్ము రమ్ము హృదయేశ్వరీ...

బాటసారులు నడచి బడలికలు మరచెదరు
కటికి పేదయుగూడ కడుపు మంటను వీడు
విగత భార్యుడు గూడ విరహబాధను వీడు
బరువుసంకెల మరచు బందీకృతుడు గూడ

రెప్పపాటున వచ్చి రెప్ప విప్పునపోయి
మాయమైపోగలవు మంత్రదండము నూపి;
నక్షత్రదర్శనము నాందిగా చెలువొంద
నీ ప్రతీక్షణమె నా నిత్యవ్రతము సుమ్ము

నీవు నా దరిచేరు నిముసమ్ములో నేను
విస్మరించెద దేవి విశ్వవిశ్వంభరను;
నీ సర్మ భావనకు నీ మర్మగాహనకు
మంత్ర ముగ్ధుడుగాని మనిషియే మహిలేడు.

యోగీశ్వరులుగాని భోగీశ్వరులు గాని
పండితవరులుగాని పామరజనులుగాని
నీ మధుర మృదుపాద నీరేజ యుగళమ్ము
నెత్తిపై బత్తితో హత్తుకొందురు గాదె!

విశ్రాంతి లేకుండ వెఱ్ఱిపరుగులు పెట్టి
ఎండమావుల వెంట గుండె వ్రీలగ నేగు
మాయ మనుజులు పెద్ద మట్టి ఉయ్యాలలో
నీ మూగ కోలలను నెమ్మదిని సుఖియింత్రు.

— నిద్రాదేవికి క్షమాపణలతో

# ప్రశ్న

కుమిలి క్రుళ్లించు, నిరుపేద గుడిసెలెల్ల
నేడు కంపుగొట్టుచునుండు నిజము; కాని
అద్యతననాగరకహృదయాలకంటె
ఎంత పరిశుభ్రమైనవో ఎంచిచూడు !

# స్వగతము

స్ఫోటక బాధచే ఒడలు సోలి పరుంటిని తల్లి ప్రక్కలో;
మాటికి మాటికిన్ మరల మంచముపై కెగబ్రాకు తేలు సన్
వ్రేటును వేయకుండ, తన వ్రేళులతో విదలించి, యెన్నియో
కాటులు తిన్న తల్లికృప కారణజన్ముడనై తరించెదన్.

# స్వాతంత్ర్య ప్రభాస

మేలుకొనుమో భరతవీరా
మేలుకొనుమో పూతచరితా
మేలుకొనుమో సర్వమానవ
సౌఖ్యవేదాంతీ !

చిమ్మ చీకటి చెదరి పోయెను
వెలుగు వెల్లువ విరిసె దిక్కుల
విజయదుందుభి వీరభారత
హృదుల మార్మ్రోగెన్

ఏడుదీవుల నాడునాడుల
నింగిప్రేలెడు నీలి మబ్బుల
ఆడుచున్నవి మూడు రంగుల
ధర్మచక్రరుచుల్

జ్ఞానవికసిత చారుచక్షులు
వేదఋషు లిట వెలసి పాడిరి
సృష్టి తమములు చెదరి పోవగ
తొలియుషస్సులలో

**శూరనేతలు వీరమాతలు**
**ధ్యానశీలురు జ్ఞానమూర్తులు**
**ధీరలలనలు తేజరిల్లిరి**
**ఈ పవిత్రధరన్**

**భారతీయులు కర్మవీరులు**
భారతీయులు జ్ఞానయోగులు
భారతీయులు త్యాగమూర్తులు
యుగయుగమ్ములలో

బుద్ధదేవుడు గాంధి పుట్టిన
పుణ్యభూమిని విశ్వమానవ
శాంతిదీపస్తంభదీధితి
మార్గదర్శి యగున్

ధర్మచక్రాంకితపతాకా
ఈ పవిత్రధరిత్రి నెగురుచు
ఏలుకొనవే మూడు ముప్పది
కోట్ల భరతహృదుల్

తుంగ భంగ తరంగ సంగతి
కడలి గర్భము కనలి మ్రోగెను
కలము నడుపుము కర్ణధారీ
తొట్రు పడకుండన్

గగనమందున కారుమబ్బుల
కటికి చీకటి గ్రమ్ముచున్నది
ప్రళయఝంఝూపవన ఘోషా
ఘూర్ణ గర్జనలన్

వెనుక చూపును వీడి ముందుకు
వేగ పోవలె వెనుక నిలిచెడి
అలసహృదయుల కొరకు ఆగెడి
అదను కాదుసుమా !

పారుబోతుల వదలివేయుము
పిరికిపందల విడిచిపుచ్చుము
కదము త్రొక్కుచు కదలిపోరా
ఓ భరతవీరా !

భరతమాతకు భాగ్యధాత్రికి
శాంతిసీమకు ఆర్షభూమికి
అన్నపూర్ణకు అమృతశీలకు
హృదయవందనముల్

అసతునుండీ సత్తులోనికి
కటికి చీకటినుండి వెలుగుకు
చావునుండీ బ్రదుకు మేరకు
చేర్పుమో ! జననీ !

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

Acc. No. 2037 Call No. T 81 R14T

Title [illegible]

[illegible]

# UNIVERSITY OF HYDERABAD
## LIBRARY
### HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**